# గొప్ప దినం

## జెఫన్యా గ్రంథం సంగ్రహ సమీక్ష

**A. ఉపోద్ఘాతం :** దక్షిణ ఇశ్రాయేలు రాజ్యానికి, చెరకు ముందు చివరిగా పరిచర్య చేసిన ప్రవక్త జెఫన్యా. ఇతడు బబులోను చెరను మరియు భవిష్యత్తులో రాబోయే ప్రభువు దినమును దృష్టిలో ఉంచుకొని గొప్ప దినమును గూర్చి ప్రజలను హెచ్చరించాడు.

**1. <u>గ్రంథకర్త</u> :** యూదా రాజైన హిజ్కియా వంశానికి చెందిన జెఫన్యా ఈ గ్రంథాన్ని వ్రాసాడు. బహుశా ఇతడు యిర్మీయా, నహూము మరియు హబక్కూకు సమకాలికుడై ఉండవచ్చును. జెఫన్యా యూదా రాజైన యోషీయా పాలనలో పరిచర్య చేసాడు. ఇతడు ఖండించిన కొన్ని దురాచారాలను యోషీయా నిర్మూలం చేసాడు. గనుక జెఫన్యా పరిచర్య క్రీ.పూ. 621 సంవత్సరంలో యోషీయా చేసిన సంస్కరణకు, గొప్ప ఉజ్జీవానికి సహాయపడిందని చెప్పవచ్చును. క్రొత్త నిబంధనలో యోహాను ప్రేమ అపొస్తలునిగా పిలువబడినట్లే, జెఫన్యా ప్రేమ ప్రవక్తగా పిలువబడ్డాడు.

**2. గ్రంథ రచన కాలం :** జెఫన్యా పరిచర్య క్రీ.పూ. 625-610 కొనసాగింది గనుక ఈ మధ్యకాలంలో ఈ గ్రంథం వ్రాయబడి ఉండవచ్చును.

**3. చారిత్రాత్మక నేపథ్యం :** రాజైన హిజ్కియా మరణానంతరం, యూదయ మత పరిస్థితి అన్యాచారాలకు, విగ్రహారాధనకు దిగజారిపోయింది. ఆ కాలంలో మెసపొతొమియా ప్రాంతాలపై ఆధిపత్యం వహించిన అష్షూరీయులు, సిథియనుల దాడులను ఆపడములో నిమగ్నమైనందువలన, యోషీయాకు యుద్ధాల బెడద తప్పడమే కాక, తన సంస్కరణలను విజయవంతంగా కొనసాగించేందుకు వీలు కలిగింది (II రాజు 22,23 అధ్యా). సిథియనులు అనాగరికులైన సంచారజీవులు. యుద్ధ వీరులైన వీరు పశ్చిమ సైబీరియా నుండి వచ్చినవారు. సుమారు క్రీ.పూ. 2000 సంవత్సరము నుండి వీరు, నల్ల సముద్రం మొదలుకొని కాస్పియన్ సముద్ర ప్రాంతం వరకు ఆక్రమించుకొని జీవించారు. అష్షూరీయులు, మాదీయులకు విరోధంగా చేసిన దండయాత్రలో వీరు అష్షూరీయులకు సహాయం చేసారు. క్రీ.పూ. 630 సంవత్సరంలో నీనెవెను విడిపించి, తరువాత పాలస్తీనను ఆక్రమించుకున్నారు. క్రీ.పూ. 110 సంవత్సరంలో క్రిమియా యుద్ధంలో నెయపొలి దగ్గర తమ రాజధానిని స్థాపించుకున్నారు. పౌలు కొలస్సీ పత్రికలో (3:11) ప్రస్తావించిన సిథియనులు వీరే.

జెఫన్యా ప్రవక్త, దేవుని ఉగ్రతను గూర్చి ప్రజలకు వివరించడానికి సిథియనుల క్రూరత్వాన్ని ఒక సాదృశ్యంగా తీసుకొన్నాడు.

4. **ముఖ్యాంశం :** ఇతడు ఇతర ప్రవక్తలవలెనే ముఖ్యంగా యదయు మరియు పొరుగు రాజ్యాలపై రానున్న తీర్పును గూర్చి ప్రకటిస్తూ ఆ గొప్పదినం సమీపించినదని హెచ్చరించాడు. ఇతడు విగ్రహారాధనను, అన్యాచారాలను ఖండించాడు. దేవుడు తన ప్రజలను అగ్నిలో పుటమువేసి తన పనికి సిద్ధం చేస్తాడని చెప్పాడు. అయితే ఈ తీర్పువెనుక, తన ప్రజలను బాగు చేయాలన్న ఉద్దేశం గల దేవుని ప్రేమను గూర్చి, శ్రద్ధను గూర్చి కూడ వివరించాడు. జెఫన్యా 3:17 తుఫానుతో భీభత్సంగా ఉన్న సముద్రంలో గొప్ప ఆశను పుట్టించే చిన్న ద్వీపములాంటిది.

**B. జెఫన్యా గ్రంథ విభజన :**

**I. యూదయ మరియు యెరూషలేము మీదికి రానున్న తీర్పు - 1 అధ్యా**

**II. భూమి మీదికి మరియు దేశాలన్నిటి మీదికి రానున్న తీర్పు - 2:1-3:8**

**III. తీర్పులన్నీ కొట్టివేయబడతాయి, రాజ్యం స్థిరపరచబడుతుంది - 3:9-20**

**C. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :**

**I. దుర్ధినము - ప్రవక్త తీర్పును ప్రకటించుట. (1:1-3:8)**

ఆ. దేవుని స్థలముపైకి రానున్న తీర్పు :

1. **తీర్పు యొక్క వాస్తవికత (1:2-4) :** ఈ భాగము నోవహు కాలంలో వచ్చిన జలప్రళయంలో కలిగిన నాశనమును జ్ఞాపకం చేస్తున్నది. ఈలాంటి నాశనమే భవిష్యత్తులో రానున్నదని చెప్పాడు. యూదయకు రానున్నదని చెప్పిన ఈ తీర్పు క్రీ॥శ॥ 586 సంవత్సరములో వారు బబులోను చెరకు తీసికొనిపోబడినపుడు నెరవేరింది.

2. **తీర్పుకు కారణం (1:5-6) :** ఈ దేశ పతనం మూడు దశలలో జరిగింది. మొదట మతభ్రష్టత, తరువాత నైతిక భ్రష్టత మరియు రాజకీయ అస్తవ్యస్తతనే వారి తీర్పుకు కారణమైనది. వారు నిజదేవుని విడచి అసత్య దేవుళ్ళతో కలవడం వారి ఆత్మీయ అంధత్వాన్ని భ్రష్టత్వాన్ని తెలియజేస్తుంది. బయలు దేవత ఆరాధన ప్రప్రథమంగా ఉత్తర రాజ్యంలో యెజెబెలు ద్వారా, దక్షిణ రాజ్యంలో మనష్షే ద్వారా ప్రవేశపెట్టబడింది. ఈ మనష్షేనే అమ్మోనీయుల మోలెకు దేవతారాధనను ప్రవేశ పెట్టాడు. (**II** రాజు 21 అధ్యా; **II** ది.వ. 33 అధ్యా). ఈ ప్రజల ఇళ్ళ మిద్దెలన్నీ విగ్రహారాధన కేంద్రాలుగా మారాయి (1:5). ఈ కోవకు చెందిన వారిలో రాజులు కూడ ఉన్నారు (1:8). వీరు అన్యదేశ వస్త్రధారణకు, పద్ధతులకు ప్రాధాన్యతనిచ్చారు. అవి వారిని దేవుని అనుగ్రహానికి పాత్రులుగా చేస్తాయని నమ్మారు.

3. **తీర్పు పేరు :** జెఫన్యా ఈ తీర్పును యెహోవా దినము అని పేర్కొన్నాడు. సుమారు 7 సార్లు ఈ మాటను పలికాడు (1:7,14,18,2:2,3).

**4. తీర్పు ఫలితాలు (1:14-18) :** ఈ తీర్పు ఎంత భయంకరంగా ఉంటుందో ఈ వచనాలలో చెప్పబడింది. 17వ వచనంలో శిక్ష తీవ్రతను తెలియజేస్తుంది. ఈ తీర్పును గూర్చి చెప్తున్నప్పుడు జెఫన్యా బబులోను దాడులనే కాక, మహాశ్రమల కాలాన్ని కూడ దృష్టిలో ఉంచుకొని హెచ్చరించాడు. దేవునికి కోపం వచ్చినప్పుడు ఏదేగాని భద్రతనివ్వదు. ఆ దినమున, ఏదేగాని వారిని శిక్ష నుండి తప్పించలేవు (1:18). కనుక తమకున్న వాటిని బట్టి అతిశయించేవారందరు దీనిని జ్ఞాపకముంచుకోవాలి. తమను రక్షించగల దేవుణ్ణి ఆశ్రయించాలి. పాపాలను ఒప్పుకొని క్షమాపణ పొందాలి. యేసు క్రీస్తు ఒక్కడే ఆ ఉగ్రత నుండి మానవులను రక్షంచగలడు (యోహా 3:36).

**ఆ. దేవుని శత్రువులపై తీర్పు :** దేవుడు తన స్వంత ప్రజలను, ఇతర జాతులను దేశాలను కూడ శిక్షిస్తాడు. తన ప్రజలపై తీర్పు, క్రమశిక్షణకై ప్రేమతో దండించేది (హెబ్రీ 12:6). అవిశ్వాసులైన లోకస్తులకు నిత్యనాశనమే తీర్పు.

**1. ఫిలిష్తీయ పట్టణాల నాశనం (2:4-7) :** ఫిలిష్తీయుల ప్రధాన పట్టణాలైన గాజా, అష్కెలోను, అష్డోదు, ఎక్రోను నాశనం చేయబడతాయి. భవిష్యత్తులో దేవుడైన యెహోవా యూదా వారిని కటాక్షించి, చెరలో నుండి రప్పించినప్పుడు, వారిలో శేషించినవారికి, ఈ ప్రాంతం నివాస స్థలంగా, వారి మందలకు మేత స్థలంగా ఉంటుంది.

**2. మోయాబు మరియు అమ్మోను నాశనం (2:8-10) :** ఈ రెండు జాతులకు మూల పురుషుడు ఒక్కడే (ఆది 19:37,38). వీరు యూదావారిని నిందించి, దూషించారు గనుక వారి గర్వాన్ని బట్టి నాశనం చేయబడతారు. మోయాబు దేశం సొదొమ పట్టణం వలె, అమ్మోను దేశం గొమొఱ్ఱా వలె ముండ్ల చెట్లకు ఉప్పుగోతులకు స్థానమై నిత్యము పాడుగా ఉంటాయి.

3. దేవుని ఖడ్గము కూషీయులను (ఇతియోపియనులను) హతం చేస్తుంది (2:12).

4. అష్షూరు దేశం, మరియు దాని ముఖ్య పట్టణమైన నీనెవె నాశనం (2:13-15). దాని అతిశయం మరియు నిర్విచార స్థితే పతనానికి కారణమైంది.

**ఇ. దేవుని పట్టణమైన యెరూషలేముకు రానున్న తీర్పు :** యెరూషలేము దేవుని పట్టణం, అందులో ఆయన మందిరం ఉన్నది, యాజకులు ఉన్నారు. కాని ఈ పట్టణ స్థితి అన్యదేశాల స్థితిలాగే ఉన్నది. దేవుని మహిమ సన్నిధిగల ఈ పట్టణం ఆధ్యాత్మిక సంపదలున్న పట్టణం గనుక ఇతర పట్టణాలకన్న దీనికే ఎక్కువ తీర్పు ఉన్నది. యెరూషలేముకు రానున్న తీర్పు, భయాన్ని కలిగిస్తుంది. కాని అంత్య దినాన అన్యదేశాలపై రానున్న తీర్పు (మహాశ్రమల కాలం) మరి ఎక్కువ భయంకరమైంది (జెకర్యా 14:1-3). యూదావారు పాపంలో, అపనమ్మకంతో ఉంటూనే, మడ్డిమీద నిలిచిన ద్రాక్షారసంలా ఉన్నారు (1:12), పైగా యెహోవా మేలైనను, కీడైనను చేయడు అని తమ మనస్సులలో

అనుకొని నిశ్చింతగా ఉన్నారు. దేవుణ్ణి చులకనగా చేసారు. మరో విధంగా చెప్పాలంటే ఆయనతో మాకేమి పని లేదు అన్న నిశ్చింతతో ఉన్నారు. కనుక దేవుడు వారిని శిక్షిస్తాడు. పరమ వైద్యునిగా తన ప్రజల ఆధ్యాత్మిక, నైతిక వ్యాధిని శస్త్ర చికిత్స ద్వారా బాగుచేయాలనే ఈ శిక్షను విధించాడు. ఈ శిక్ష వెనుక యూదాపట్ల దేవుని ప్రేమ వ్యక్తమౌతుంది. కనుకవారిని దీపము వెలిగించి పరిశోధించి వారి పాపాన్ని వెలికి తీసి బాగుచేస్తాడు. ఈ శిక్ష రెండు విధాలుగా అమలు పరచబడుతుంది.

1. **వారి వ్యాపార కేంద్రంలో ఉపద్రవం (1:10) :** యెరూషలేముకు ఉత్తరభాగాన, పట్టణం చుట్టు కొండలున్నాయి. ఈ కొండల దిక్కు నుండి గొప్ప నాశనం వస్తుంది. మత్స్యపు గుమ్మము అంటే, గలిలయ సముద్రం మరియు యోర్దాను నది నుండి చేపలను వ్యాపారం కోసం తీసికొని వచ్చే మార్గం. ఈ పట్టణానికి తీర్పు తీర్చబడినపుడు, ఈ గుమ్మములో రోదన శబ్దం మరియు పట్టణపు దిగువ భాగంలో అంగలార్పు వినబడుతుంది.

2. **పట్టణపు అధికారుల ద్వారా శిక్ష (3:1-7) :** ఈ పట్టణం అపవిత్రమైనది, పేదలను అణగద్రొక్కింది. ప్రజల హక్కులను గౌరవించలేదు. దేవుని మాట ఆలకించదు, శిక్షకు లోబడదు, యెహోవాయందు విశ్వాసముంచదు, ఆయన యొద్దకు రాదు. దేవుని ప్రజలకు నాయకులుగా ఉన్నవారే, దేవుని మందిరం పట్ల గౌరవాన్ని కోల్పోయేలా ప్రవర్తించారు. ఈ పట్టణం మానవ పాలనకే ప్రాధాన్యతనిస్తుంది. గనుక దాని అధిపతుల ద్వారానే దానికి శిక్ష విధించబడుతుంది. దేవుని సార్వభౌమత్వం, మానవ పాలనలో ఈ సూత్రాన్ని అమలు పరుస్తుంది. కాని ఆయన ప్రేమగలవాడు దీర్ఘశాంతుడు గనుక వారికి చివరి అవకాశాన్ని యిస్తూ మారుమనస్సుకై పిలుపునిస్తున్నాడు (3:8).

## II. సంతోషకరమైన దినము :

### A. ప్రవక్త న్యాయాన్ని ప్రకటించుట (3:8-20) :

దేవుడు నీతిమంతుడు, పరిశుద్ధుడు గనుక పాపాన్ని శిక్షిస్తాడు. తీర్పు తీరుస్తాడు. అంతమాత్రమే కాదు ఆయన న్యాయవంతుడు గనుక న్యాయంగా తీర్పు తీరుస్తాడు. ఎవరి క్రియలకు తగినట్లు వారికి తీర్పు తీర్చబడుతుంది. ఈ తీర్పులో దేవుని కోపం వెనుక ప్రజలను బాగుచెయ్యాలన్న ప్రేమ కనిపిస్తుంది. లోకంలో గొప్ప విపత్తులను, వినాశనాలను పంపించి శుద్ధీకరించాక శేషముగా కొన్ని జాతులు మిగులుతాయి. అలా చేయడం వలన ప్రపంచమంతా నిజ దేవుని ఆరాధనలో ఏకమౌతుంది. అదే దేవుని గొప్ప న్యాయవిధానము (2:11 జెక 14:8,9). ఈ భాగములో ఒకప్పుడు దేవునికి శత్రువులుగా ఉన్నవారికి, దేవుని స్థలముకు, మరియు దేవుని పట్టణమైన యెరూషలేముకు ఆయన న్యాయము తీర్చే విధానమును గూర్చి వ్రాయబడింది.

**B. ఒకప్పుడు దేవునికి శత్రువులుగా ఉన్నవారికి తీర్చే న్యాయం (3:9,10) :**

జనులందరు యెహోవా నామమును బట్టి యెహోవాను సేవించునట్లు వారికి పవిత్రమైన పెదవుల నిస్తాడు. ఆంగ్ల భాషలో, "నేను వారికి పవిత్రమైన భాషను ఇస్తాను" అని వ్రాయబడింది. బాబెలు గోపురం వద్ద శాపకారణంగా భాషలు తారుమారు చేయబడ్డాయి. ఇప్పుడు అందుకు విరుద్ధంగా అందరికీ ఒకే భాషనిస్తాడు. సార్వత్రికంగా ఒకే భాషలో మాట్లాడుటలోని ఆనందాన్ని పొందేందుకు అనుమతిస్తాడు. అది ఏ భాషనో మనకు తెలియదు. అయితే క్రొత్త భాష కాక, అందరూ మాట్లాడగల శ్రేష్ఠమైన వాడుక భాష కావచ్చు. ఇంకా చెప్పాలంటే అది, విమోచించబడినవారు మాట్లాడే నైతిక పవిత్రత గల భాష. అనగా ఈ క్రొత్త భాషలో అపవిత్రమైన మాటలు ఉండవు. అందులో అసభ్యత, దేవదూషణ ఉండవు. పరలోకంలో అందరూ మాట్లాడే ఈ భాషకు మనం ఇప్పుడే ఇక్కడే అలవాటుపడాలి (ఎఫె 5:4; కొల 4:6). ఇక 3:10 గూర్చి పలు అభిప్రాయాలున్నాయి.

1. దేవుని నిబంధన మందసం ప్రస్తుతం ఇతియోపియా (కూషు)లో ఉన్నదని, ఆ సమయానికి అది యెరూషలేముకు తీసుకొని రాబడుతుందని ఒక అభిప్రాయం.
2. ఇతియోపియాలోని అబిస్సినియాకు చెందిన ఫలాషాస్ అనే తెగవారు తాము ఇశ్రాయేలీయులని నిరూపించుకొని అక్కడ స్థిరపడతారని మరో అభిప్రాయం.
3. లోకంలోని దేశాల, జాతుల నుండి రక్షించబడినవారందరు, చెదరిపోయిన ఇశ్రాయేలీయులను దేవునికి కానుకగా తెస్తారన్న మరో అభిప్రాయం.
4. కూషు దేశస్తులు కూడ రక్షించబడతారు. వారు వెయ్యేండ్ల పాలనలో ఉంటారు అన్న అభిప్రాయం (10వ) వారు రక్షించబడడమే దేవునికి కానుకగా ఉంటుంది.

**C. దేవుని స్థలమును గూర్చిన న్యాయం (3:11-13) :** తన ప్రజలు ఇకమీదట వారు చేసిన క్రియల విషయమై సిగ్గుపడరు. అంటే, వారు పాపం చేస్తూనే, సిగ్గుపడకుండా ఉంటారని కాదు. గత పాపాల విషయం దేవుడు శిక్షించి శుద్ధీకరించాడు. గనుక ఇక వాటిని జ్ఞాపకం చేసికొని సిగ్గుపడనక్కలేదు. దుఃఖించనక్కర లేదు. అయితే విశ్వాసిగా ఉంటు పాపం చేస్తు, దాని గూర్చి సిగ్గుపడకుండ సంతోషిస్తున్నావంటే నీవు దేవుని బిడ్డవు కావు అని అర్థం. దావీదు పాపం చేసినపుడు సంతోషంగా లేడు. తన రక్షణానందాన్ని కోల్పోయాడు (కీర్త 51:12). అలాగే తప్పిపోయిన కుమారుడు సంతోషంగా లేడు తిరిగి తండ్రితో సమాధాన పడినపుడే వారి సిగ్గును, అవమానాన్ని మరచిపోయి సంతోషించగలిగాడు.

బబులోను చెరకు తీసికొని పోబడని, కుంటి, గ్రుడ్డి, బలహీనులు, పేదల విషయం కూడ దేవుడు శ్రద్ధ చూపించాడు (3:12). దేవుని ప్రజలు పాపం చేసినా, అందరూ పాపంలో నిలిచి ఉండరు (3:13). దేవుని కొరకు జీవించే శేషం ఎప్పుడూ ఉంటుంది. వెయ్యేండ్ల పాలనలో గొప్ప శేషం ఉంటుంది. వారు పాపం చేయరు, అబద్ధమాడరు, కపటములాడు నాలుక వారి నోటనుండదు. వారు ఎవరి భయము లేకుండా విశ్రాంతిగా ఉంటారు.

## D. దేవుని పట్టణానికి చేయబోయే న్యాయం :

ఆయన తన రాజ్యాన్ని భూమి మీద స్థాపించినపుడు ఎలా ఉంటుందో ఈ భాగం తెలుపుతుంది (జెఫ 3:14,15). యెరూషలేము తిరిగి ఉత్సాహగానాలతో నింపబడుతుంది. ఆ గానాలలోని సందేశమంతా, దేవుడు వారికి విధించిన శిక్షను కొట్టివేసాడని, వారి శత్రువులను వెళ్ళగొట్టాడని, మరియు ఆయనే రాజుగా వారి మధ్య ఉన్నాడన్నదే. తన ప్రజల విషయం దేవునికి కలిగే ఆనందాన్ని సంతృప్తిని తెలియజేసే గొప్ప వచనం జెఫన్యా 3:18. దేవుడు నిరంతరం తన పనిలో నిమగ్నమైయున్నాడు. పగటి యొక్క వెలుగును ఆనందించడానికే రాత్రి యొక్క చీకటిని దేవుడు ఉద్దేశించాడు. ఆయనకు మనపట్ల గల ప్రేమలో, పగటి వెలుగులో ఆయన మనల్ని బట్టి విశ్రమించాలని కోరుతున్నాడు. నిన్ను బట్టి ఆయన అలా విశ్రమించగలుగుతున్నాడా? అట్టి విశ్రాంతిని నీవు ఆయనకు ఇవ్వగలుగుతున్నావా? నీవు ఇంకా దేవునికి అయిష్టంగా జీవిస్తూ ఉంటే నిన్ను బట్టి ఆయన విశ్రమించడు. దేవుడు తన ప్రజలకు ఇవ్వబోయే వెలుగు మహిమాన్వితమైనది (3:18-20). ఈ మహిమాన్వితమైన స్థితి, బంగారు వీధులు, బాష్పబిందువులు తుడిచివేయబడుట వంటిది కాదు. ఆయనకు మన పట్ల గల ప్రేమను బట్టి మన జీవితాల్లో అనుమతించబడిన కష్టాలు కడగండ్లను బట్టి ఆయనను స్తుతించి, కృతజ్ఞతలు చెల్లించడమే మహిమాన్వితమైనది. మనల్ని ఇబ్బంది కొలిమిలో వేసి, జ్ఞానముగల తండ్రిగా ఆయన మనతో వ్యవహరించిన విధానాన్ని బట్టి ఒక దినాన మనందరం ఆయనను స్తుతించబోతున్నాం.

ప్రియ పాఠకులారా! జెఫన్యా గ్రంథంలో దేవుడు తన ప్రజలను, మరియు లోకస్తులను ద్వేషించే వానిగా, కఠినుడుగా, పగతీర్చుకొనే వాడుగా కనిపిస్తున్నాడు. విశ్వాసులైనా అవిశ్వాసులైనా వారిని శిక్షించినపుడు, ఆ తీర్పులో సహితం ఆయన ప్రేమ కనిపిస్తుంది. నిశీధిరాత్రి అపెండిసైటిస్ (కడుపు నొప్పి)తో విలవిలలాడుతున్న తన బిడ్డను తీసికొని అర్ధరాత్రి వేళ ఎంతో దూరం ప్రయాణం చేసి, వైద్యుని చేతుల్లో పెట్టినపుడు, వెంటనే వైద్యుడు ఆ బిడ్డ కడుపును కోసి శస్త్ర చికిత్స చేస్తే, ఆ తండ్రిని కఠినుడు అని అంటామా? తన బిడ్డ పట్ల గల ప్రేమను బట్టి ఆ తండ్రి కఠినంగా వ్యవహరించాల్సి వచ్చింది. అది బిడ్డ క్షేమం కోసమే.

ఈ తలంపుతో దేవుడు నీ జీవితంలో అనుమతించిన పరిస్థితులను సంతోషంగా అంగీకరిస్తూ, దేవుడు నేర్పించే పాఠాలు నేర్చుకొంటు సరి చేసుకుంటే నిన్ను బట్టి దేవుడు సంతోషిస్తాడు. ఆకాశం ఎప్పుడు మేఘావృతం కాదని, జీవితమంతా పూలబాటగానే ఉంటుందని, ఎప్పుడూ వెలుగే ఉంటుందని, చీకటి ఉండదని, బాధలే ఉండవని, ఎప్పుడూ సంతోషమే ఉంటుందని దేవుడు వాగ్దానం చేయలేదు. కాని అలాంటి పరిస్థితుల కొరకు శక్తిని, చీకటిలో త్రోవచూపించేందుకు వెలుగును, కష్టాలలో ఆయన కృపను, సహాయాన్ని, కష్టానికి తగిన విశ్రాంతిని ఇస్తానని వాగ్దానం చేసాడు. ఎడతెగని, ఎన్నడు చెరగని ఆ ప్రేమలో కొనసాగగల కృప ప్రభువు దయచేయును గాక!

★ ★ ★ ★ ★

# గొప్ప పిలుపు

## హగ్గయి గ్రంథం సంగ్రహ సమీక్ష

**A. ఉపోద్ఘాతం :**

బబులోను చెర నుండి మొదటి విడతలో, యెరూషలేముకు తిరిగి వచ్చిన శేషము మధ్య పరిచర్య చేసిన ముగ్గురు ప్రవక్తలలో, హగ్గయి ఒకడు. ఇది పాత నిబంధనలోని చిన్న పుస్తకాలలో రెండవది. దేవుని పని నిమిత్తం ప్రజలను ప్రోత్సహిస్తూ ఇచ్చిన పిలుపే ఈ గ్రంథ సారాంశం.

**1. గ్రంథకర్త :** ఈ గ్రంథాన్ని హగ్గయి స్వయంగా వ్రాసాడు. ఇతని పేరు తప్ప, ఇతర వివరాలేవి బైబిలులో వ్రాయబడలేదు. ఇతడు దేవుని దూతగా, వార్తాహరునిగా ఉన్నాడు. యెహోవా వాక్కు ఇదే అని అతడు చెప్పడము వలన, ఇది అతని స్వంత సందేశం కాదని, దేవుని సందేశమని స్పష్టమౌతుంది. హగ్గయి మరియు జెకర్యా ఇద్దరూ ప్రజలను సంధించిన విధానం వేరు. హగ్గయి తన గుర్తింపు కన్న దేవుని గుర్తింపును గూర్చి ప్రాధాన్యతనిచ్చాడు. ఆయనను హెచ్చించాడు. ప్రజల్ని గద్దించడమే కాక ప్రోత్సహించాడు. బోధించడమేకాక ఆచరణలో పెట్టాడు.

**2. గ్రంథ రచన కాలం :** క్రీ.పూ. 520 సంవత్సరం ఆగష్టు మాసము నుండి డిసెంబర్ మాసముల మధ్య కాలంలో దేవుని ద్వారా పొందిన వాక్కులు ఈ గ్రంథంలో వ్రాయబడ్డాయి. హగ్గయి ఈ ప్రవచన కాలాన్ని స్పష్టంగా వ్రాసాడు. దర్యావేషు పాలనలో 2వ సంవత్సరం 6వ నెల మొదటి దినమున ప్రవచించడం ప్రారంభించాడు. చెరకు ముందు ఉన్న ప్రవక్తలు, తాము ఎవరి కాలంలో ప్రవచించారో ఆ ఇశ్రాయేలు రాజుల లేక యూదా రాజుల పరిపాలన కాలాన్ని తమ గ్రంథాలలో పేర్కొన్నారు. హగ్గయి అన్యరాజుల పాలనలో ఉన్నాడు. గనుక ఆ రాజుల పరిపాలన కాలాన్ని సూచించాడు. దర్యావేషు, క్రీ.పూ. 521 సంవత్సరంలో తన పరిపాలనను ప్రారంభించాడు. అతని పాలనలో రెండవ సంవత్సరంలో అనగా క్రీ.పూ. 520 సంవత్సరంలో హగ్గయి ప్రవచించాడు.

**3. ముఖ్య సందేశం :** యెహోవామందిరాన్ని పునర్నిర్మించుట. హగ్గయి సందేశం చాల సులభమైనది. ఆచరణాత్మకమైనది.

*4. మూల వచనాలు :* ***"పర్వతము లెక్కి మ్రాను తీసికొనివచ్చి మీరు మందిరమును కట్టించిన యెడల దానియందు నేను సంతోషించి, నన్ను ఘనపరచుకొందునని యెహోవా సెలవిచ్చుచున్నాడు"*** (హగ్గ 1:8). ***"యెహోవా యూదా దేశపు అధికారియగు షయల్తీయేలు కుమారుడైన జెరుబ్బాబెలు యొక్క మనస్సును, ప్రధాన యాజకుడైన యెహోజాదాకు***

***కుమారుడైన యెహోషువ మనస్సును, శేషించిన జనులందరి మనస్సును ప్రేరేపింపగా"*** హగ్గ 1:14.

5. **హగ్గయి గ్రంథ విశిష్టత :**

**అ)** హగ్గయి మరియు జెకర్యా ఇద్దరు మందిర నిర్మాణం విషయం ప్రజలను ప్రోత్సహించారు. కలిసి పనిచేసారు. జెకర్యా దర్శనాలు పొందుతూ ఆకాశంలో విహరిస్తూ ఉన్న అనుభవాన్ని కలిగి ఉన్నాడు. హగ్గయి భూమి మీదనే నిలుచున్న కార్యశీలునిగా ఉన్నాడు. దర్శనాలు గల వ్యక్తి కార్యశీలుడైన వ్యక్తి కలిసి పనిచేయడం ఎంతైన అవసరం.

**ఆ)** హగ్గయి ప్రవచనం, మరియు యాకోబు పత్రిక ఒకేలాగ ఉన్నాయి. రెండు కూడ జీవిత అభ్యాసానికి ప్రాధాన్యతనిచ్చాయి. క్రియ ఆధ్యాత్మికమైనది. ఏమి చేయ్యకూడదన్న ఉద్దేశం చెడ్డది. పని అన్నది జీవితం యొక్క పరిమాణము (కొలత)ను సూచిస్తుంది. హగ్గయి మరియు యాకోబు మానవుల జీవితంపైన పని చేయుట అనే ఈ కొలబద్దనుంచారు.

**ఇ)** యేసు ప్రభువు చెప్పిన అన్యుల పాలన (లూకా 21:24) బబులోను చెరతో ప్రారంభమైనప్పటికిని, ఆయన మాటల నెరవేర్పు హగ్గయి ప్రవచనాలతో ప్రారంభమైనది.

6. **హగ్గయి ప్రవచించిన సందర్భం :** బబులోను చెర నుండి, ఎజ్రా మరియు జెరుబ్బాబెలు నాయకత్వంలో, మొట్టమొదట యెరూషలేముకు తిరిగి వచ్చిన 50,000 మంది ఇశ్రాయేలీయులు, ఎంతో ఉత్సాహంగా దేవుని మందిరాన్ని పునర్నిర్మించడానికి మొదలు పెట్టారు. కాని వారు ఎదుర్కొన్న గొప్ప ఆటంకాలను బట్టి దానిని వాయిదా వేసారు. ఈ విషయమై హగ్గయి వారిని హెచ్చరించి ప్రోత్సహించాడు. తీరా వారు శ్రమపడి మందిరాన్ని పూర్తిచేసాక, సొలొమోను కాలం నాటి వైభవోపేత మందిరాన్ని చూసినవారు ఈ మందిరంతో దానిని పోల్చుకొని చాలా నిరుత్సాహపడ్డారు. అయితే దేవుడు ఈ మందిరాన్ని తన మహిమతో ఎలా నింపబోతున్నాడో మరియు భవిష్యత్తులో, వెయ్యేండ్ల పాలనలో అది ఎంత మహిమాన్వితంగా ఉంటుందో ప్రవక్త వారికి వివరించాల్సి వచ్చింది.

7. **చారిత్రక నేపథ్యం :** బైబిలు అంతటిలో చాల క్లుప్తమైన, స్పష్టమైన కాలమానాన్ని తెలిపే గ్రంథం హగ్గయి. ఇశ్రాయేలీయులు తిరిగి వచ్చుట, మందిరం కట్టబడుట, నెహెమ్యా యెరూషలేము ప్రాకారమును పునర్నిర్మించుటను గూర్చిన కాలమును గమనిద్దాం.

అ) క్రీ.పూ. 536 సంవత్సరం మొదటి విడత యూదులు యెరూషలేముకు వచ్చారు.

ఆ) క్రీ.పూ. 536 సంవత్సరం 7వ నెల, బలిపీఠం కట్టి బలులను అర్పించారు.

ఇ) క్రీ.పూ. 535 సంవత్సరం రెండవ నెల మందిర పునాది ప్రారంభించబడింది. కాని మధ్యాంతరంగా పని ఆగిపోయింది.

ఈ) క్రీ.పూ. 520 సంవత్సరం ఆరవ నెల (సెప్టెంబర్) మొదటి రోజు, మందిర నిర్మాణాన్ని గూర్చి హగ్గయి ప్రజలకు పిలుపునిచ్చాడు.

1. 6వ నెల 24వ తేదీ నిర్మాణం ప్రారంభించబడుట.
2. 7వ నెల 21వ దినం ప్రవక్త రెండవ పిలుపునిచ్చుట.
3. 8వ నెల జెకర్యా మాట్లాడుట.
4. 9వ నెల 24వ తేదీ హగ్గయి మూడవ మరియు నాలుగవ పిలుపు నిచ్చుట.
5. 11వ నెల 24వ తేదీ జెకర్యా దర్శనాలు.

ఉ) క్రీ.పూ. 518 సంవత్సరం 9వ నెల 4వ రోజు జెకర్యా దర్శనాలు.

ఊ) క్రీ.పూ. 516 సంవత్సరం 12వ నెల 3వ రోజు మందిర నిర్మాణం పూర్తి అగుట.

ఎ) క్రీ.పూ. 515 సంవత్సరం 14-21 తేదీ వరకు పస్కా పండుగను ఆచరించుట.

ఏ) క్రీ.పూ. 455 సంవత్సరం కొన్ని సంస్కరణల నిమిత్తం ఎజ్రా తిరిగి యెరూషలేమునకు వచ్చుట.

ఐ) క్రీ.పూ. 445 సంవత్సం నెహెమ్యా ప్రకారాన్ని కట్టుట, మరియు మలాకీ ప్రవచనకాలం.

**B** **గ్రంథ విభజన :** హగ్గయి గ్రంథంలో తేదీల వారిగా ఐదు ప్రధాన సందేశాలున్నాయి. వాటిని బట్టి గ్రంథాన్ని క్రింది విధంగా విభజించవచ్చును.

## I. ప్రజలకు ఒక సవాలు - (క్రీ.పూ. 520 సంవత్సరం - సెప్టెంబర్ 1వ తేది) - 1:1-11

1. ప్రజల ఆసక్తిలోని మార్పును బట్టి ఒక హెచ్చరిక (1:1-4)
2. ప్రజల ప్రవర్తన గుర్తించాలన్న ఒక పిలుపు (1:5-7)
3. మందిర నిర్మాణాన్ని గూర్చిన ఒక ఆజ్ఞ (1:8-11)

## II. సవాలుకు ప్రతిస్పందన - 1:12-15

1. మందిరాన్ని నిర్మించుట - ప్రజల విధేయత (1:2)
2. దేవుని నిర్ధారణ - (1:13-15)

## III. ప్రజల నిరుత్సాహం - ప్రభువు ప్రోత్సాహం - 2:1-9

(క్రీ.పూ. 520, అక్టోబర్ 21వ తేదీ) (2:1-9)

## IV. ధర్మశాస్త్రమును గూర్చి విన్నవించుట - నియమాన్ని వివరించుట - 2:10-19

(క్రీ.పూ. 520, డిసెంబర్ 24వ తేదీ)

**V. దేవుని కార్యాక్రమాన్ని గూర్చిన ప్రత్యక్షత - భవిష్యత్తుకై కనిపెట్టుట - 2:20-23**
(క్రీ.పూ. 520, డిసెంబర్ 24వ తేదీ)

## C. అంశాల వారిగా సంగ్రహ సమీక్ష :

**I. హగ్గయి మొదటి పిలుపు (ప్రజల హస్తాలనుద్దేశించినది) (1:2)**

ఈ పిలుపులో దేవుడు తన సందేశాన్ని మొదట నాయకులకు ఇచ్చాడు (హగ్గ 1:1). జెరుబ్బాబెలు పౌరసంబంధ నాయకుడు - ఇతడు దావీదు వంశానికి చెందినవాడు (I ది.వృ. 3:17,19). జెరుబ్బాబెలు అన్నది అన్యపేరు. బబులోనులో ఉన్నప్పుడు అతనికి ఆ పేరు పెట్టబడింది. ఇతడు కోరేషు ద్వారా యూదయకు గవర్నరుగా నియమించబడ్డాడు (ఎజ్రా 5:14). యెహోషువ మత సంబంధమైన నాయకుడు. ఇతడు ఇశ్రాయేలీయులు బబులోను చెరకు వెళ్ళిన కాలంలో ప్రధాన యాజకునిగా ఉన్న యెహోజాదాకు కుమారుడు (I ది.వృ. 6:15).

1. **ప్రజల ఆసక్తిలో మార్పును గూర్చిన హెచ్చరిక :** యెరూషలేముకు తిరిగి వచ్చిన యూదులు మందిర నిర్మాణానికి వెంటనే ఎంతో ఉత్సాహంగా పూనుకొన్నప్పటికిని, సమరయుల ద్వారా ఎదురైన ఆటంకాలలో 15 సంవత్సరాలపాటు పని ఆగిపోయింది. ఈ ఆటంకాలను బట్టి వారు, మందిరాన్ని కట్టడానికి ఇది సరైన సమయం కాదు అనుకొన్నారు. ఇంకా సమయం రాలేదు అన్న కుంటిసాకు చెప్పసాగారు. అయితే మందిరాన్ని కట్టేందుకు నెపములు చెప్పిన వీరు తమ స్వంత గృహాలను వైభవోపేతంగా కట్టుకున్నారు. దేవుని ఇంటి పనిని ప్రక్కన బెట్టి వారి యింటి పనినే చూచుకున్నారు. అనగా వారు ఆయన చిత్తంలో లేరు. వారి అవిధేయతను నెపములతో కప్పిపుచ్చ ప్రయత్నించారు. గనుక దేవుడు వారి విషయం సంతోషంగా లేడు. అందుకే వారిని, నా ప్రజలు అనకుండ, ఈ ప్రజలు అంటున్నాడు (1:3).

ఈలాంటివారు ఈ దినాన కోకొల్లలుగా ఉన్నారు. వారి జీవిత పరిస్థితులలో, సమస్యలలో దేవుని చిత్తాన్ని తెలుసుకోరు, దాని గూర్చిన మాటనే ఎత్తరు. కాని దేవుని పని చెయ్యాలంటే దేవునికి ఇవ్వాలంటె అది దేవుని చిత్తంకాదని, ఇంకా సమయం రాలేదని లేక ఇది తగిన సమయం కాదని నెపములు చెప్పే విశ్వాసులెందరికో హగ్గయి హెచ్చరిక ఒక గుణపాఠంగా ఉండగలదు.

కొంతమంది ఒక పనిని ప్రారంభించినపుడు అది దేవుని చిత్తం అంటారు. ఏదైనా అవాంతరాలు రాగానే ఇది దేవుని చిత్తం కాదని, దేవుడు మరో పనిని, మరో విధంగా చెయ్యమన్నాడని చెప్తారు. మందిర నిర్మాణం, ఇతర సంఘ కార్యక్రమాల నిమిత్తం కానుకలివ్వడం దేవుని చిత్తం కాదు, సువార్త సేవకు మాత్రమే ఇవ్వాలని చెప్తారు. కాని దానికి కూడ ఇవ్వరు. హోటల్ వెయిటర్‌కు ఇచ్చినంత కూడ దేవునికి ఇవ్వరు.

వీరందరు హగ్గయి కాలంనాటి ప్రజల లాంటివారే. ఇశ్రాయేలీయులు తమ గృహాలను కట్టుకొనేందుకు ఎన్ని కష్టాలనైనా భరించారు గాని దేవుని యిల్లు కట్టేందుకు నెపములు చెప్పారు.

2. **తమ ప్రవర్తనను గుర్తించాలన్న పిలుపు (1:5)** : దేవుడు వారి ప్రవర్తనను గూర్చి ఆలోచించుకొమ్మని సలహా ఇచ్చాడు. వారు విస్తారంగా విత్తినప్పటికి, కొంచెమే పండినది. భోజనం చేసినను ఆకలి తీరలేదు. పానం చేసినను వారి దాహం తీరలేదు. బట్టలు కప్పుకున్నా చలి ఆగకున్నది. సంపాదించుకున్నా, వారి జీతము చినిగిపోయిన సంచిలో వేసినట్టున్నది. తమను తామే కేంద్రంగా చేసుకుని జీవిస్తున్నవారి గతి ఇంతే. అనేక పర్యాయాలు మన జీవితంలో కొన్ని విషయాలు ఎందుకు జరుగుతున్నాయో అర్థం చేసుకోము. మనకు కలిగే ఉపద్రవాలకు ప్రభుత్వం, కుటుంబ సభ్యులు, ఇతర విశ్వాసులు కారణం అనుకోవడం తప్పు. అందుకు నీవే బాధ్యుడవు (లేవీ. 26:21-24). ఆ పరిస్థితులకు కారణాన్ని తెలిసికొంటె దేవుని విధానాలను అర్థం చేసుకుంటాం. కారణాలను గ్రహించి సరిచేసుకుని ఆయనను ఘనపరిస్తే, ఆయన మనల్ని ఘనపరుస్తాడు (లేవీ 26:41). ప్రజల నిర్లక్ష్యాన్ని బట్టి దేవుడు వారిని ఆత్మీయంగాను, ఆర్థికంగాను ఆశీర్వదించలేకపోయాడు. దేవుడు శిక్షిస్తున్నాడంటే తప్పని సరిగా కారణం ఉంటుంది. అందుకే వారి ప్రవర్తనను గూర్చి ఆలోచించమని చెప్పాడు. ఈనాడు మీ ప్రవర్తన ఎలా ఉన్నది? మీరు ఏ మార్గంలో నడుస్తున్నారు? అది మిమ్మల్ని ఎక్కడికి తీసుకొని వెళ్తున్నది?

3. **మందిర నిర్మాణాన్ని గూర్చిన ఆజ్ఞ (హగ్గ 1:8)** : దేవుడు ప్రజల సమస్యకు ఒక పరిష్కారాన్ని చూపిస్తున్నాడు అది సులభమైనదే, గాని తప్పనిసరిగా ప్రాధాన్యతనివ్వాలి. అదేమనగా, వారి ఆసక్తిలో మార్పు రావాలి. మొదట వారి స్వంత పనులకు ప్రాధాన్యత నివ్వకుండ, దేవునికి మొదట ప్రాధాన్యతనివ్వాలి (మత్త 6:33). నీ డబ్బు ఏ విధంగా వినియోగిస్తున్నావన్న దానిని బట్టి అది ఆత్మీయంగా ఎంచబడుతుంది. మీ గృహంలో సంఘంలో దేవుడు ఘనపరచబడితే, మీ గృహము మరియు సంఘము ఆత్మీయంగా ఉంటాయి. మనుష్యులు కోరుకునేవన్నీ తప్పుకాదు. కాని వాటికే ప్రథమ స్థానం ఇవ్వడం, స్వార్థం కోసం వాడుకోవడం తప్పు. యూదులలో స్వార్థం చోటు చేసుకున్నందున దైవకార్యాన్ని గుర్తించలేని అంధత్వం కలిగి ఉన్నారు. దానికి వారి సోమరితనం తోడయింది. కనుక దేవుడు పర్వతాల మీదికి వెళ్ళి మ్రానులు తెచ్చి, మందిరాన్ని కట్టమని చెప్పాడు. దేవుడు ఊరికే అద్భుతాలు చేయడు సుమా! నీ పక్షంగా నీవు చెయ్యాల్సిన పని చెయ్యాలి. సేవకులు, సంఘస్తులు విజయాలు పొందక పోవడానికి కారణం ఇదే. సంఘాలలో బహిరంగ ప్రసంగాలు, ప్రార్థనలు చేసేవారు మాత్రమే కాదు, కష్టపడి పనిచేసే పరిచారకులు కూడ కావాలి.

## II. సవాలుకు ప్రతిస్పందన (1:12-15) :

ప్రవక్త ద్వారా దేవుడు ప్రజలతో చేసిన సవాలుకు వారు విధేయత చూపించారు.

1. **మందిరాన్ని కట్టారు :** దేవుని పని ఎంతగా చేస్తున్నావనే దానికన్న ఎంత విధేయత చూపిస్తున్నామన్నది ముఖ్యము (I సమూ 15:22). మొదట నాయకులు విధేయత చూపించారు (1:14,15), ప్రజలను ప్రోత్సహించారు, కలిసి పని చేసారు. క్రైస్తవ నాయకులు భవిష్యత్తు కొరకైన దేవుని ప్రణాళికను మరియు ఆయన చిత్తాన్ని తెలుసుకుంటే ప్రజలు అన్ని విషయాలలో వారితో సహకరిస్తారు. ప్రజలు కూడ హగ్గయిని దేవుని చేత పంపబడిన రాయబారిగా, ప్రవక్తగా గుర్తించి దేవునియందు భయభక్తులు నిలిపారు (1:12).

2. **దేవుని అభయమును పొందారు (1:13) :** విశ్వాసులు మరియు వారి ఆత్మీయ నాయకులు దేవునికి విధేయత చూపించి, భయపడినపుడు, దేవుని నుండి అద్భుతమైన రీతిలో నిర్ధారణను పొందగలుగుతారు. ఆయన వారితో "నేను మీకు తోడుగా ఉన్నాను" అని అభయమిచ్చాడు. ఆయన యుగయుగాలు మనకు తోడైయున్న దేవుడు (మత్త 1:23; 28:19,20). ఈ వాగ్దానంతో ఆయన నాయకుల మనస్సులను, ప్రజల మనస్సులను పురికొల్పాడు (1:14). సంఘ నాయకులు, దేశనాయకులు కార్యాచరణకు పూనుకొంటే పౌరులందరూ పూనుకొంటారు. ప్రతి క్రైస్తవ నాయకుడు జెరుబ్బాబెలు, హగ్గయి, జెకర్యా, ఎజ్రా, నెహెమ్యా మరియు యెహోషువలాంటి కార్యశీలురు కావాలి. 24 రోజుల తరువాత ప్రజలు మందిర నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించారు. "నేనుమీకు తోడైయుంటాను" అన్న మాట వారికెంతో ప్రోత్సాహాన్ని, ధైర్యాన్ని, నిశ్చయతను ఇచ్చింది.

## III. హగ్గయి రెండవ పిలుపు (ప్రజల హృదయాలనుద్దేశించినది) (2:1-9):

ఇది హగ్గయి మూడవ సందేశం. 7వ నెల 21వ రోజు అనగా పర్ణశాలల పండుగలో 7వ దినాన ఈ సందేశం ఇవ్వబడింది. ప్రజలు దేవుని సన్నిధిని గూర్చిన ప్రోత్సాహంతో ఒక నెల ఎంతో ఆసక్తిగా పని చేసారు. మందిర నిర్మాణంలోని అభివృద్ధి, వారి ఆసక్తిని మరింత అధికం చేసింది. అయితే వారి ఉత్సాహాన్ని నీరు గార్చే ఒక నిరుత్సాహం వారికి ఎదురైంది. యెరూషలేములో సొలొమోను కట్టించిన మునుపటి మందిర వైభవాన్ని చూసిన వారు ఈ మందిరాన్ని చూచి ఎలుగెత్తి ఏడ్చారు. ఎజ్రా 3:8-13 లో ఈ సంఘటన వివరించబడింది. ఆనందోత్సాహాల మధ్య, వారి రోదన ధ్వని ప్రజలలో గొప్ప నిరుత్సాహాన్ని కలిగించింది.

ఈనాడు కూడ విశ్వాసులను అలా నిరుత్సాహపరచేవారు ఉన్నారు. కొన్ని సేవలు గొప్పగా కనిపించవు. కాని అలాంటి స్థలాలలోనే గొప్ప కార్యాలు జరుగుతాయి.

పరిమాణము కన్నా ప్రమాణికత ప్రాముఖ్యమైనది. ఈనాడు గొప్ప గొప్ప భవనాలున్న సంఘాలున్నాయి. కాని వాటి నిండ ప్రజలు లేరు. వారికి సరైన ఆత్మీయ నాయకత్వం లేదు. ఇశ్రాయేలీయుల ఈ సమస్యకు కూడ దేవుడు సులువైన పరిష్కారం చెప్పాడు (2:4).

**1. ధైర్యంగా ఉండాలి, పని చేయాలి :** ఈ సందేశం కూడ వారి నాయకులతోనే చెప్పాడు. గొప్ప మందిరాల కన్న దేవుని సన్నిధి మరియు మహిమగల సంఘం గొప్పది. గనుక గత వైభవాలను గూర్చి చెప్పి, ఇతరుల ప్రస్తుత ఉత్సాహాన్ని నీరుగార్చి నిరుత్సాహ పరచవద్దు. హగ్గయి ద్వారా దేవుడు ప్రస్తుతం స్థానికంగా ఉన్న పరిమిత కట్టడంపై వారి దృష్టిని కేంద్రీకరించి, భవిష్యత్తులో ఇశ్రాయేలుకు చేయబోవు దానిపై మనస్సును కేంద్రీకరించమని చెప్పుతున్నాడు, సొలొమోను కట్టిన మందిరంలో ప్రజలు షెకీనామహిమ నివసించినట్లు చూడలేదు. అటు తరువాత హేరోదు కట్టించిన మందిరంలో యేసు స్వయంగా తన మహిమను నింపాడు. యోహాను 1:14లో "తండ్రివలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమ వలె మనమాయన మహిమను కనుగొంటిమి" అని వ్రాసాడు.

ఈ సందర్భంగా వెయ్యేండ్ల పాలనలో దేవుని మహిమతో నింపబడబోయే ఆలయాన్ని గూర్చి ప్రవక్త ప్రోత్సహిస్తున్నాడు. ఆయన అన్య జనులందరిని కదలింపగా అన్య జనులందరి యొక్క యిష్టవస్తువులు తేబడతాయి. వారికి ఇష్టమైన వస్తువులు ఏవో 2:7,8 వచనాలను కలిపి చదివితే అర్థమౌతుంది. సొలొమోను వెండి, బంగారాలతో మందిరాన్ని కట్టాడు. అవన్నీ నెబుకద్నెజరు తన దేశానికి తీసుకొని వెళ్ళాడు. అవన్నీ దేవునివే. కాని వెయ్యేండ్ల పాలనలో వీటన్నిటిని మించిన గొప్ప మందిరం ఉంటుంది. అది ఆయన మహిమతో నింపబడి ఉంటుంది. ఈ స్థలంలో మరియు ప్రపంచమంతట శాంతి సమాధానాలు ఉంటాయి (లూకా 2:14; రోమా 5:1; ఫిలి 4:7). ఏ మందిరంలో లేని ఈ సంపదలతో భవిష్యత్ మందిరం నింపబడుతుంది (యెహె 40-48 అధ్యా). ఆ భవిష్యత్ మేలు వెంటనే జరుగకపోయినా నిరుత్సాహపడవద్దు (రోమా 8:28).

## IV. ప్రవక్త మూడవ పిలుపు ప్రజల నాయకుని ఉద్దేశించినది 2:10-7 :

**1. యూదా అపవిత్రత (2:10-17) :** ఇది నాలుగవ సందేశం. దీనికి ముందు సందేశం 2 నెలల క్రితం వచ్చింది. దేవుడు యూదాను రెండు ప్రశ్నలకు జవాబు ఇమ్మని అడిగాడు. దానికి ధర్మశాస్త్రం నుండి వివరణనిచ్చాడు. కొన్ని ప్రశ్నలకు ధర్మశాస్త్రంలో జవాబు లభించదు, గాని సమయానుసారంగా దేవుడే జవాబిస్తాడు (ద్వితీ 17:8-11).

హగ్గయి ఇక్కడ రెండు ఆత్మీయ సత్యాలను వివరిస్తున్నాడు. అపవిత్రమైనది పవిత్రమైన వాటిని కలుషితం చేస్తుంది గాని పరిశుద్ధమైనది అపవిత్రమైన దానిని శుద్ధిచేయలేదు.

**ఉదా:-** చెడు నీరు మంచినీటిని కలుషితం చేస్తుంది. గాని, చెడు నీటిని మంచినీరు శుభ్రం చేయలేదు. మశూచిసోకిన రోగికి రోగంలేని మంచివ్యక్తి తాకితే వాడు బాగుపడడు. పైగా ఆ రోగం, మంచి వ్యక్తికి అంటుకుంటుంది. ఆత్మీయ విషయాలలోను ఇదే నియమం వర్తిస్తుంది. పరిశుద్ధత కన్న అపవిత్రత ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. అది ఎక్కువ కాలం నిలుస్తుంది. యూదులు పవిత్ర నగరంలో ఉంటు, పవిత్ర దేవాలయాన్ని కట్టినంత మాత్రాన వారు పరిశుద్ధులు కారు, లేక ఒకప్పుడు ఇశ్రాయేలుకున్న నీతి ఈ కాలంలోనికి సరఫరా చేయబడదు. పైగా వారి అవినీతి, అవిధేయత వారిపై, వారి పిల్లలపై ప్రభావాన్ని చూపిస్తుంది. (లేవీ 5:2; సంఖ్యా 19:11-13,22 నుండి రోమా 6:22 తో పోల్చిచూడండి). దేవుని కొరకు చేసే పనుల వలన పరిశుద్ధత మరియు దీవెనలు రావు.

2. **దేవుని తీర్మానం (2:18,19) :** వారు మందిరాన్ని పూర్తి చేయాలని తీర్మానించుకున్న నాటి నుండే దేవుడు వారిని దీవించాలని నిశ్చయించుకున్నాడు.

## V. దేవుని ప్రణాళికను గూర్చిన ప్రత్యక్షత :

1. **మహాశ్రమల కాలం (2:20,22) :** ఇంతకాలం ఇశ్రాయేలీయులను బాధించిన అన్యదేశాలను దేవుడు నాశనం చేస్తాడు (హగ్గ 2:21,22) (హెబ్రీ 12:26; ప్రక 16:18-20). వారి రథాలను పడద్రోస్తాడు. ఎందుచేతనంటే వారు వాటినే నమ్ముకున్నారు. ఈనాడు అణ్వస్త్రాలను నమ్ముకొన్న దేశాలన్నిటిని దేవుడు కదిలిస్తాడు. జెరుబ్బాబెలును దేవుడు హెచ్చిస్తాడు (2:23). వెయ్యేండ్ల పాలనలో జెరుబ్బాబెలు యేసు ప్రభువుకు ప్రధానమంత్రిగా ఉంటాడని కొంతమంది నమ్ముతారు. ముద్ర ఉంగరం ముఖ్యమైన దస్తావేజులపై సంతకం చేయడానికి ఉపయోగపడుతుంది. ఇది జెరుబ్బాబెలు అధికారాన్ని సూచిస్తున్నది మరియు అనుమతిస్తున్నది. మెస్సీయా, జెరుబ్బాబెలు వంశం నుండి వస్తాడన్న వాగ్దానం కూడ ఉన్నది.

మహా శ్రమలకాలం అనంతరం యేసు వెయ్యేండ్ల పాలనలో ప్రపంచ సింహాసనాన్ని అధిష్టించినపుడు, దేవుడు దావీదు మరియు జరుబ్బాబెలు వంశాలను క్రీస్తులో ఉంచుతాడు. హగ్గయి చిన్న పుస్తకమైనా, నైతిక పాలకునిగా క్రీస్తును సరైన స్థానంలో ఉంచింది. ఆ స్థానాన్ని గుర్తించి, ఆయన పనిని నమ్మకంగా చేద్దాం. ఒకరినొకరు ప్రోత్సహించుకుందాం (I కొరి 15:58).

★ ★ ★ ★ ★

# గొప్ప దర్శనాలు

## జెకర్యా గ్రంథం సంగ్రహ సమీక్ష

A. **ఉపోద్ఘాతం :** బబులోను చెరనుండి తిరిగి వచ్చిన ఇశ్రాయేలీయులను దేవుని మందిరాన్ని పునర్నిర్మించడానికి ప్రోత్సహించిన ప్రవక్తలలో జెకర్యా ఒకడు. పాత నిబంధనలో దాదాపు చివరి పుస్తకమైన ఈ గ్రంథం యుగాంతమందు జరుగబోయే అనేక విషయాలను స్పష్టంగా వివరిస్తుంది.

1. **గ్రంథకర్త :** ఇద్దోకు పుట్టిన బెరక్యా కుమారుడైన జెకర్యానే ఈ గ్రంథాన్ని వ్రాసాడని (1:1), అతడు ఎజ్రాకాలం నాటి వాడని (ఎజ్రా 5:1; 6:14) అందరూ అంగీకరించారు. ఇతడు యిర్మీయా మరియు యెహెజ్కేలు వలె యాజకవంశానికి చెందినవాడు (నెహె 12:4). జెకర్యా 9–14 అధ్యాయాలను అతడు వ్రాయలేదని, అవి ఇతర భాగాలతో ఏకీభవించడం లేదని కొందరు బైబిలు పండితుల అభిప్రాయము. అందుకు కొన్ని కారణాలున్నాయి.

అ) 1–8 అధ్యాయాలు సంపూర్ణ నిరీక్షణను వెల్లడిస్తూ ఉండగా, 9–14 అధ్యాయాలలో దుష్టనాయకత్వాన్ని చూపించడమే గాక, మందిర పునర్నిర్మాణమును గూర్చిన వివరణలే లేవు. బహుశా 1–8 అధ్యాయాల అనంతరం, 9–14 అధ్యాయాలు దీర్ఘకాల వ్యవధితో అతని వృద్ధాప్యంలో ప్రవచించిన విషయాలు అయి ఉండవచ్చునని మరి కొందరి అభిప్రాయం.

ఆ) జెకర్యా 9:13 లో గ్రీకుల శక్తి ప్రబలమైనట్లున్నది. కాని 1–8 అధ్యాయాలలో చూస్తే అప్పుడు పారసీకులు అధికారంలో ఉన్నారు. అయితే, క్రీ.పూ. 480 సం॥ గ్రీకులు పారసీకులను జయించడాన్ని జెకర్యా ప్రత్యక్షంగా చూసి ఉంటాడని మరికొంతమంది అభిప్రాయం. అతడు జీవించిన కాలంలో ఇద్దరి పరిపాలనలను చూసి ఉంటాడు.

ఇ) 13వ అధ్యాయంలోని ప్రవచనాలను గూర్చి అమర్యాదకరమైన వ్యాఖ్యానాలు ఉన్నాయి.

ఈ) 14వ అధ్యాయంలోని ప్రత్యక్షీకరణ సాహిత్యానికి చెందిన విషయాలు, తరువాతి కాలంలో చేర్చబడ్డాయని కొందరు విమర్శకుల అభిప్రాయం.

2. **గ్రంథ రచన కాలం :** క్రీ.పూ. 520 సం॥లు

3. **గ్రంథ విశిష్ఠత :**

అ) జెకర్యా గ్రంథంలో దానియేలు, యెహెజ్కేలు మరియు ప్రకటన గ్రంథాలలో వలె ప్రత్యక్షీకరణ సాహిత్యం, అనగా యుగాంతమందు జరుగబోయే విషయాలను గూర్చిన

దర్శనాలున్నాయి. దానియేలు, యోహెజ్కేలు మరియు యెహానులు, ఇశ్రాయేలు దేశంలో పుట్టినా వారు ఇశ్రాయేలుకు వెలుపట దర్శనాలను చూసారు, గ్రంథాలను వ్రాసారు. జెకర్యా బబులోనులో పుట్టి, ఇశ్రాయేలు దేశంలో దర్శనాలను చూచి, తన గ్రంథాన్ని వ్రాసాడు. ఇశ్రాయేలు శేషమును ఆవరించిన నిరాశ అనే చీకటిలో, ఇతడు ఎత్తబడుటను గూర్చి, మహిమను గూర్చి నిరీక్షణగల దర్శనాలను చూసాడు.

ఆ) జెకర్యా గ్రంథంలో **"సైన్యములకు అధిపతియగు యెహోవా"** అన్నమాట 52 సార్లు వ్రాయబడింది.

ఇ) ఇతర చిన్న ప్రవక్తల కంటె, ఎక్కువగా మెస్సీయాను గూర్చిన ప్రవచనాలు ఉన్న గ్రంథం జెకర్యా కనుక, ఇది చాల ప్రాముఖ్యమైనది, ఆసక్తికరమైనది. 3:8లో క్రీస్తును చిగురుగా, దేవుని సేవకునిగా; 9:9 లో యెరూషలేములో జయప్రవేశం చేసినవానిగా; 13:7లో కాపరిగా; 11:12,13లో 30 వెండి నాణాలకు అప్పగించబడుట; 12:10లో ఆయన పాద హస్తాలు చీల్చబడుట; 14:3-8 లో ఆయన ఒలీవల కొండ మీదికి తిరిగి వచ్చుటను గూర్చిన ప్రవచనాలను జెకర్యా చెప్పాడు.

ఈ) మరో ముఖ్యమైన విషయమేమంటే హగ్గయి మరియు జెకర్యా ఒకే కాలంలో, ఒకే ప్రజలకు ప్రవచించినా, ఇద్దరూ వేర్వేరు రీతులుగా ప్రవచించారు. హగ్గయి ఒక వాస్తవిక వ్యక్తిగా భూమిపై సంచరిస్తే, జెకర్యా దర్శనాత్మక వ్యక్తిగా గగన విహారం చేసాడు. ఈ రెండు రకాల బోధకులు అవసరం. ఈ దినాల్లో మనం చూస్తున్నాం, ఆచరణాత్మక వ్యక్తులకు దర్శనాలుండవు, దర్శనాత్మక వ్యక్తులు ఆచరణాత్మకంగా ఉండరు. ఈ రెండు లక్షణాలు కలిపి ఉంటే గొప్ప కార్యాలను సాధించవచ్చును.

## B. జెకర్యా గ్రంథ విభజన :

**I. ప్రత్యక్షీకరణ దర్శనాలు : 1-6 అధ్యా** (మెస్సీయాను గూర్చి మరియు వెయ్యేండ్ల పాలనను గూర్చి)

| | | |
|---|---|---|
| అ. | ఉపోద్ఘాతం మరియు హెచ్చరికతో కూడిన వర్తమానం | (1:1-6) |
| ఆ. | పది దర్శనాలు (అన్నీ ఒకే రాత్రి చూసాడు) | (1:7-6:15) |
| | 1. గొంజిచెట్ల క్రింద గుఱ్ఱముపైనున్న మనుష్యుడు | 1:7-17 |
| | 2. నాలుగు కొమ్ములు | 1:18,19 |
| | 3. నలుగురు కంసాలులు | 1:20,21 |
| | 4. కొలనూలు చేత పట్టుకొన్న మనుష్యుడు | 2 అధ్యా |
| | 5. యెహోషువ మరియు సాతాను | 3:1-7 |
| | 6. చిగురు అను సేవకుడు | 3:8-10 |

7. దీపస్తంభము మరియు రెండు ఒలీవ చెట్లు 4 అధ్యా

8. ఎగిరిపోవు పుస్తకం 5:1-4

9. కొలతూములో స్త్రీ 5:5-11

10. నాలుగు రథాలు 6 అధ్యా

## II. చారిత్రక విరామం : 7-8 అధ్యా

అ. మతాచారము (ఉపవాసము)ను గూర్చి ప్రశ్న 7:1-3

ఆ. మూడు రకాల జవాబు 7:4-8:23

1. హృదయం సరిగా ఉన్నప్పుడే ఆచారం సరైనదిగా ఎంచబడుతుంది 7:4-7
2. హృదయం సరిగా లేకుంటె ఆచారం సరైనదిగా ఎంచబడదు 7:8-14
3. యెరూషలేమును గూర్చి దేవునికి గల ఉద్దేశం ఏ ఆచారాన్ని బట్టి కూడ మార్చబడదు. 8 అధ్యా

## III. ప్రవక్త భారములు : 9-14 అధ్యా

అ. మొదటి భారం - క్రీస్తు మొదటి రాకడను గూర్చిన ప్రవచనాత్మక దృక్పథాలు (9:11 అధ్యా)

ఆ. రెండవ భారం - క్రీస్తు రెండవ రాకడను గూర్చిన ప్రవచనాత్మక దృక్పథాలు (12-14 అధ్యా)

## C. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :

## I. ప్రవక్త పదివిధాల దర్శనాలు (1-6 అధ్యా)

**ఉపోద్ఘాతం :** జెకర్యా తన పరిచర్యను, దర్యావేషు పరిపాలనలో రెండవ సంవత్సరం, ఎనిమిదవ నెలలో ప్రారంభించాడు. హగ్గయి కూడ అదే రాజు పరిపాలనలో, అదే సంవత్సరం, ఆరవ నెలలో పరిచర్య ప్రారంభించాడు. హగ్గయి ఆ సంవత్సరంలోనే సెప్టెంబర్, అక్టోబర్ మరియు డిసెంబర్ మాసాలలో ప్రవచించాడు. అతడు మౌనం వహించిన నవంబర్ మాసంలో జెకర్యా ప్రవచించాడు.

ఉపోద్ఘాతంలోనే, ఇశ్రాయేలీయుల పితరుల పట్ల దేవునికి గల అసంతృప్తిని ప్రవక్త తెలియజేస్తూ (1:2) మీరు వారి వలె ఉండవద్దని హెచ్చరిస్తున్నాడు (1:4). వారి పితరులు చేసిన తప్పు ఏమనగా, వారి దుష్క్రియలను మాని దేవుని వైపు తిరగమని ప్రవక్తలు చెప్పిన మాటలను వారు వినలేదు. వారికి ప్రకటించిన ప్రవక్తలు చనిపోయారు గాని, వారి ద్వారా దేవుడు సెలవిచ్చిన మాటలు తు.చ. తప్పక నెరవేర్చబడ్డాయి. వాటిని నిర్లక్ష్యం చేసిన పితరులు దాని పర్యవసానాన్ని అనుభవించాక గాని దేవుని మాటల విలువను గ్రహించలేక పోయారు. గ్రహించినా అప్పుడు ఫలితం లేకపోయింది

(1:6). ప్రియ పాఠకులారా! దేవుని వాక్యం అనేక విషయాలలో మనలను హెచ్చరిస్తున్నది. వాటికి లోబడకుంటే వాటి పరిణామాన్ని తప్పకుండ ఎదుర్కొవలసి వస్తుందని జ్ఞాపకముంచుకోవాలి.

జెకర్యా ద్వారా దేవుడు సెలవిచ్చిన సందేశమంతా ఒక్కటే "మీరు నా తట్టు తిరిగిన యెడల నేను మీ తట్టు తిరుగుదును (1:3). 1:7 నుండి జెకర్యా దర్శనాలు ప్రారంభమైనవి. ఈ పది దర్శనాలను కూడ ఒకే రాత్రి చూడడం గొప్ప విశేషం.

1. **మొదటి దర్శనం - ఎఱ్ఱ గుఱ్ఱముపై నున్న మనుష్యుడు (1:7-17) :** ఎఱ్ఱ గుఱ్ఱము నెక్కి, గొంజి చెట్ల మధ్య నిలువబడిన వ్యక్తి, మానవావతారానికి ముందు ఉన్న యేసు క్రీస్తు. ఆయనే యెహోవా దూత అని కూడ పిలువబడ్డాడు (1:11,12). పాత నిబంధనలో యేసుక్రీస్తు పలు మారులు యెహోవా దూతగా పిలువబడ్డాడు (నిర్గ 23:20,21). ఆయన యెరూషలేముపై నున్న దేవుని కోపాన్ని తొలగించి, వారిని కనికరించమని ఆయనకు మనవి చేసాడు (1:2). దేవుడు యెరూషలేమును గూర్చి ఆయనకున్న అధికాసక్తిని తెలుపుతూ పునర్నిశ్చయతనిచ్చాడు (1:13-17).

   వేరే రంగు గుఱ్ఱాలపైనున్న వారు దేవునిచే పంపించబడిన దూతలు (1:10). వీరు భవిష్యత్తు కొరకైన దేవుని ప్రణాళిక ప్రకారం పని చేస్తున్నారు. వీరు లోకమంతా తిరిగివచ్చి, లోకులందరు శాంతము కలిగి నిమ్మళముగా ఉన్నారని చెప్పారు. అయితే అది ఎక్కువ కాలం ఉండే శాంతి కాదని గమనించాలి.

2. **రెండవ దర్శనం - నాలుగు కొమ్ములు (1:18,19) :** జెకర్యా దర్శనంలో చూచిన ఈ నాలుగు కొమ్ములు,యూదావారిని ఇశ్రాయేలు వారిని, యెరూషలేము నివాసులను చెదరగొట్టిన శక్తులని వాక్యంలో స్పష్టంగా వ్రాయబడింది. ఆ దినాలలో ప్రపంచాన్ని ఏలిన నాలుగు బలమైన రాజ్యాలను ఈ కొమ్ములు సూచిస్తున్నవి. వారే ఇశ్రాయేలీయులను కూడ చెదరగొట్టారు.

అ) అష్షూరు - ఇది ఉత్తర ఇశ్రాయేలు రాజ్యాన్ని చెరపట్టింది (**II** రాజు 17 అధ్యా)

ఆ) బబులోను - ఇది దక్షిణ ఇశ్రాయేలు రాజ్యాన్ని చెరపట్టింది (**II** రాజు 24 అధ్యా)

ఇ) పర్షియా (పారసీక) రాజ్యము - యూదులందరిని నాశనం చేసేందుకు ప్రయత్నించింది (ఎస్తేరు గ్రంథం). కొంతమంది మూడవ కొమ్ము గ్రీకు సామ్రాజ్యం అని కూడ చెప్తారు.

ఈ) రోమా సామ్రాజ్యము - ఇది క్రీస్తుకు పూర్వం ఇశ్రాయేలును హింసించినది. క్రీస్తు కాలంలో కూడ యెరూషలేముపై భారమైన పన్ను విధించింది.

ఈ నాలుగు కొమ్ములు దానియేలు ప్రవక్త ద్వారా చెప్పబడిన నాలుగు రాజ్యాలు అని కూడ చెప్పవచ్చును. (దాని 2:37-45; 7:2-8,17-28).

**3. మూడవ దర్శనం : నలుగురు కంసాలులు (1:20,21)**

వీరిని గూర్చి రెండు అభిప్రాయాలున్నాయి

అ. దేవుని నాలుగు రకాల తీర్పులను సూచిస్తుండవచ్చును. అనగా యుద్ధము, కరవు, క్రూరమృగాలు మరియు తెగుళ్ళ ద్వారా తీర్పు తీర్చుట (యెహె 14:21; ప్రక 6:1-8).

ఆ. జెక 1:21 ప్రకారం యూదా వారిని చెదర గొట్టిన రాజ్యాలను పడగొట్టిన వారని స్పష్టమవుతున్నది. యూదావారిని బబులోనీయులు చెరపడితే, బబులోనును పారసీకులు జయించారు. పారసీకులను గ్రీకులు జయించారు. గ్రీకులను రోమీయులు జయించారు. కనుక పారసీకులు, గ్రీకులు మరియు రోమీయులు మొదటి ముగ్గురు కంసాలులు. రోమా సామ్రాజ్యాన్ని ఇంత వరకు ఎవరూ నాశనం చేయలేదు. అంతర్గత కలహాలను బట్టి అది పతనం అయింది. కాని అంత్య క్రీస్తు దానిని తిరిగి బలపరుస్తాడు. అయితే యేసుక్రీస్తు వాణ్ణి మహాశ్రమల చివరి కాలంలో నాశనం చేస్తాడు (ప్రక 19:16). కనుక నాలుగవ కంసాలి యేసే. యేసు మొదటి రాకడలో వడ్రంగివాడు అని పిలువబడ్డాడు. రెండవ రాకడలో కంసాలి వానిగా వస్తాడు. బైబిలులోని ప్రతి లేఖనం, ప్రవచనం దేవుని మహత్తర ప్రణాళిక ప్రకారం నెరవేర్చబడతాయి.

**4. నాల్గవ దర్శనం : కొలనూలు చేతపట్టుకొన్న మనుష్యుడు :** బైబిలులో కొలనూలు, కొలవడానికి సిద్ధమైన విధానాన్ని సూచిస్తున్నది (యిర్మీ 31:38,39; యెహె 40:2-4, ప్రక 11:1,2). అంతమాత్రమే కాదు, యెరూషలేమును లేక దానిలోని మందిరాన్ని కొలిచినట్లు నాలుగు సార్లు వ్రాయబడింది (జెక 2:1-3; ప్రక 11:1,2; యెహె 40:3,5; 37:26; ప్రక 21:15).

అ. మహాశ్రమల కాలంలో యెరూషలేము మందిరము కొలవబడుతుంది (ప్రక 11:1,2).

ఆ. వెయ్యేండ్ల పాలనలో మందిరము మరియు యెరూషలేము పట్టణము కొలవబడుతుంది (యెహె 40:3,5; 37:26). జెకర్యా కూడ ఈ వెయ్యేండ్ల పాలనలోని కొలతను గూర్చి చెప్తూ, యెరూషలేమును గూర్చి ఆసక్తికరమైన విషయాలను ప్రస్తావిస్తూ నిశ్చయతనిస్తున్నాడు (2:4-8). ప్రస్తుతము యెరూషలేము పట్టణము కొంతభాగము మట్టుకే ప్రాకారం లోపల ఉన్నది. వెయ్యేండ్ల పాలనలో అది ప్రజలతో నింపబడుతుంది గనుక దాని బయట కూడ నివసిస్తారు. ఆయన పరిపాలనలో శాంతి భద్రతలుంటాయి కాబట్టి ఇక దానికి గోడలు అక్కరలేదు. ఆయనే వారికి అగ్ని ప్రాకారముగా, మహిమకు కారణముగా ఉంటాడు. గనుక వారికి ఎవరూ ఏ హాని చేయరు (2:8) (ద్వితీ 32:10; కీర్త 17:8 కూడ చదవండి).

ఇ. వెయ్యేండ్ల పాలన తరువాత కట్టబడే శాశ్వతమైన, నూతన యెరూషలేము కొలత ప్రకటన 21:15లో వ్రాయబడింది. ఈలోకములో దేవుడు తాను ఏర్పరచుకొన్న

ఇశ్రాయేలు జాతి నిమిత్తం యెరూషలేమును కోరుకున్నాడు. ఈనాడు నీవు నేను, క్రీస్తుతో దేవుని చేత ఏర్పరచబడ్డాము. దేవుడే శిల్పిగా నిర్మాణకునిగా ఉన్న ఆ పునాదులు గల పట్టణంలో, సంఘముగా మనం నివసించబోతున్నాం. ఈ భూమి మీద జీవించినంత కాలం ప్రతి విశ్వాసి దాని కొరకే కనిపెట్టాలి (హెబ్రీ 11:9–16).

జెకర్యా కాలములో దేవుడు ఇశ్రాయేలును విడచి పెట్టినట్లు అనిపించినా, వారి పట్ల తన వాగ్ధానాల విషయం నమ్మకంగా ఉన్నాడు. మరియు వారి కోసం శాశ్వత ప్రణాళిక కలిగి ఉన్నాడు. జెకర్యా కాలంలో జరిగినవన్నీ నిత్యత్వపు గుర్తింపుకలిగి ఉన్నాయి.

బైబిలులో పాలస్తీన, పరిశుద్ధ స్థలము అని పిలువబడింది ఒక్క జెకర్యా 2:12 లోనే. ప్రస్తుతం ఆయన యెరూషలేమును తిరిగి ఏర్పరచుకోవడం లేదు, కాని ఆయన దానిని ఏర్పరచుకొన్నప్పుడు అది ఈ భూమికే కేంద్రముగా, ముఖ్యపట్టణంగా ఉంటుంది. ఆ కాలంలో ఆయన తన పరిశుద్ధాలయంలో ఉంటాడు గనుక లోకమంతా మౌనంగా ఉంటుంది.

5. **ఐదవ దర్శనం యెహోషువ మరియు సాతాను (3:1–7) :** ఈ దర్శనం రక్షణను గూర్చి, రక్షణనిచ్చే యేసుక్రీస్తును గూర్చి, రక్షణకు శత్రువైన సాతాను గూర్చి తెలియజేస్తుంది. ఇక్కడ పేర్కొనబడిన యెహోషువ, బబులోను చెర అనంతరం తిరిగి వచ్చిన ఇశ్రాయేలు శేషమునకు యాజకుడు. యెహోవా దూత అనగా, మనం ముందు చదివినట్లుగా యేసు క్రీస్తు.

ఇక్కడ గమనించాల్సిన ఒక ముఖ్యమైన విషయం ఏమంటే, రక్షణకు, విశ్వాసులకు శత్రువైన సాతాను ప్రస్తుతం నరకములో లేడు. వాడు దేవుని సింహాసనం వద్దకు కూడ వెళ్ళగలడు. వాని పనే, దేవుని బిడ్డల పైన దేవుని ఎదుట నేరారోపణ చేయడం, అందుకే వాణ్ణి ఫిర్యాది అంటున్నాము (యోబు 1:6–12; 2:1–5; ప్రక 12:10). అగ్నిలో నుండి తీసిన కొరివివలె ఉన్న యెహోషువ, చెర అనంతరం పునర్నిర్మించబడిన యెరూషలేముకు కూడ సాదృశ్యంగా ఉన్నాడు. యెహోవా దూత సాతానుతో "యెరూషలేమును కోరుకొను యెహోవా నిన్ను గద్దించును" అన్నాడు. అంటే, దేవుడు యెహోషువను బట్టి కాదుగాని యెరూషలేమును బట్టి వాణ్ణి గద్దిస్తున్నాడు.

యెహోషువ ఇశ్రాయేలు జాతికి ప్రతినిధిగా సమాజమంతటి పక్షంగా, ప్రాయశ్చిత్తార్ధ దినాన అతి పరిశుద్ధ స్థలంలో ప్రవేశిస్తాడు. అలాగే మన ప్రధాన యాజకుడైన యేసు క్రీస్తు విశ్వాసులందరి పక్షంగా దేవుని సన్నిధిలో మనకు ఉత్తర వాదిగా ఉన్నాడు (I యోహా 1,2).

ఈ భాగములో, దేవుడు యెహోషువను రక్షించుటలో తన ఉద్దేశమేంటో చెప్పాడు (3:6,7). "నా మార్గములలో నడుచుచు, నేను నీకప్పగించిన దానిని భద్రముగా గైకొనిన యెడల, నీవు నా మందిరము మీద అధికారివై నా ఆవరణములను కాపాడు

వాడవగుదువు; మరియు ఇక్కడ నిలువబడు వారికి కలిగినట్లు నా సన్నిధిని నిలుచు భాగ్యము నీకిత్తును". రక్షించబడిన ప్రతి వ్యక్తికి ఒక బాధ్యత ఉన్నదని, దానిని నెరవేరిస్తే దేవుని వలన ప్రతిఫలాన్ని పొందుతామన్న సత్యాన్ని జ్ఞాపకముంచుకోవాలి.

6. **ఆరవ దర్శనం - చిగురును గూర్చి (3:8-10) :** ఈ దర్శనం రక్షణ కారకుడైన యేసును గూర్చినది. ఇక్కడ ఆయనను జెకర్యా, చిగురు అను సేవకుడు అంటున్నాడు. ఈ పేరు బైబిలులో అనేక పర్యాయాలు పేర్కొనబడింది. ఈ పేరే యేసు క్రీస్తు పనిని కూడ సూచిస్తుంది.

అ. యెష్షయి (దావీదు) చిగురు (యెష 11:1); యిర్మీ 23:5; 33:15) : ఈ పేరు మత్తయి సువార్తలో చెప్పబడినట్లు ఆయన యూదుల రాజు అని సూచిస్తున్నది.

ఆ. నా సేవకుడైన చిగురు (జెక 3:8) ఈ పేరు మార్కు సువార్తలో చెప్పబడినట్లు ఆయన పరిచారకుడు అని సూచిస్తున్నది.

ఇ. చిగురు అను మనుష్యుడు (జెక 6:12,13) ఈ పేరు లూకా సువార్తలో చెప్పబడినట్లు ఆయన మనుష్య కుమారుడు అని సూచిస్తున్నది.

ఈ. యెహోవా చిగురు (యెష 4:2) : ఈ పేరు యోహాను సువార్తలో చెప్పబడినట్లు ఆయన దేవుని కుమారుడు అని సూచిస్తున్నది.

**చిగురు అను సేవకునిగా యేసు క్రీస్తు ప్రస్తుతం రెండు విధాల పరిచర్యను చేస్తున్నాడు.**

1. విశ్వాసులందరికి నీతి వస్త్రాన్ని ధరింపజేయుట (సామె 30:12; యెష 64:6; 4:3,4; రోమా 10:1-4; ఫిలి 3:9)
2. సాతాను నేరారోపణకు వ్యతిరేకంగా విశ్వాసుల పక్షంగా విజ్ఞాపన చేయుట (లూకా 22:31; రోమా 8:34; ఫిలి 3:9).

7. **ఏడవ దర్శనం : సువర్ణ దీపస్తంభము మరియు రెండు ఒలీవచెట్లు (4:1-4) :** ఈ దర్శనములో దీపస్తంభము దేనిని సూచిస్తున్నదో, ఒలీవ చెట్లు దేనిని సూచిస్తున్నాయో చూద్దాము.

**అ. దీపస్తంభము :**

1. దీపస్తంభము లోకములో దేవుని గూర్చిన సాక్ష్యమును సూచిస్తున్నది (మత్త 5:15,16)
2. సంఘాన్ని కూడ సూచిస్తున్నది (ప్రక 1:20; 2:5).
3. జెకర్యా గ్రంథములోని ఈ భాగములో ప్రత్యేకంగా ఇశ్రాయేలును సూచిస్తున్నది.

**ఆ. రెండు ఒలీవ చెట్లు :** ఇందులో ఒక ఒలీవ చెట్టు ఇశ్రాయేలీయులకు రాజకీయ నాయకత్వం వహించిన జెరుబ్బాబెలును, మరో చెట్టు యాజకత్వం వహించిన యెహోషువను సూచిస్తున్నది. వీరిద్దరు కూడ దేవుని మందిరాన్ని గూర్చి, మరియు

ప్రజల జీవితాలలోను, దేవుని పనిని పరిశుద్ధాత్మ ద్వారానే జరిగించగలరని అర్థం. ఒలీవనూనె పరిశుద్ధాత్మకు సాదృశ్యంగా మరియు అభిషేకమునకు సాదృశ్యంగా ఉన్నది. కనుక వీరిద్దరు దేవుని పని నిమిత్తం అభిషేకించబడ్డారని (4:14) లేక దేవుని ఆత్మ సంబంధమైన ప్రభావం వీరిలో నుండి ప్రవహిస్తున్నదని గ్రహించవచ్చును. ఈ మాటలు వారు జీవించిన కాలంనాటివైతే వీరిద్దరికి వర్తిస్తాయి. ఒకవేళ ఇవి భవిష్యత్తుకు సంబంధించిన మాటలైతే ప్రకటన 11:4 లో వ్రాయబడిన ఇద్దరు సాక్షులైయుండవచ్చును. ఏది ఏమైనా దీపస్తంభమును గూర్చిన జెకర్యా దర్శనం, ఇశ్రాయేలు శేషమునకు ప్రోత్సాహకరంగా ఉండినది. అది నేటి విశ్వాసులకు కూడ వర్తింపజేసికోవచ్చును. మన కాలంలో పరిశుద్ధాత్మ కుమ్మరింపు కన్న వెయ్యేండ్ల పాలనలో మరి ఎక్కువగా ఉంటుంది. ఆయన సర్వజనుల మీద తన ఆత్మను కుమ్మరించ బోతున్నాడు (యోవే 2:28).

## 8. ఎనిమిదవ దర్శనం - ఎగురుచున్న పుస్తకము - (5:1-4)

ఈ దర్శనం అర్థం మరియు మిగతా దర్శనాల అర్థానికి మధ్య స్పష్టమైన విభజన కనిపిస్తుంది. మొదటి రెండు అధ్యాయాలలో దేవుడు ఇశ్రాయేలు శత్రువులను నశింపజేసి తాను మొదట ఉద్దేశించినట్లు ఇశ్రాయేలు జాతినంతా తనకు యాజకులుగా చేసికొంటానని చెప్పాడు. కనుక యెహోషువను గూర్చిన దర్శనంలో అతన్ని శుద్ధీకరించినట్లు ఇశ్రాయేలు జాతి అంతా మొదట శుద్ధీకరించబడాలని కోరుతున్నాడు. అలా కడుగబడి, దేవుని రాజ్యవ్యాప్తికై దేవునిచే వాడబడాలని చిగురును గూర్చిన దర్శనం ద్వారా, మరియు వారు లోకానికి వెలుగుగా ఉండాలన్న సత్యాన్ని దీపస్తంభము ద్వారా సూచించాడు. అయితే ఆయనకు విధేయత చూపించని వారికి తీర్పు తీర్చబడుతుంది అని ఎనిమిదవ దర్శనం తెలియజేస్తుంది. ఎగురుతున్న పుస్తకం భూమి అంతటి మీదికి బయలు వెళ్ళే శాపము (5:3).

ఈ దర్శనం పాపమునకు తగిన శిక్ష ఉందని తెలుపుతూ, ప్రత్యేకించి రెండు పాపాలను గూర్చి నొక్కి చెప్తున్నది. ఇవి యూదాలో ఎక్కువగా కనిపించిన పాపాలై ఉండవచ్చును. దొంగతనం మరియు దేవుని నామమును బట్టి అబద్ధ ప్రమాణము చేయడం అనే పాపాలే దేవుని తీర్పుకు కారణమయ్యాయి. ఈ రెండు కూడ పది ఆజ్ఞలలో ప్రాముఖ్యమైనవి. అందులో ఒకటి దేవునికి సంబంధించినది. మరొకటి పొరుగువారికి సంబంధించినది.

చరిత్ర ప్రారంభము నుండి కూడ రక్షించబడని ఇశ్రాయేలీయులు, మహాశ్రమల కాలం తరువాత, వేయ్యేండ్ల పాలనకు కొంచెం ముందుగా తీర్పుకు గురౌతారు (మత్త 25:1-30; రోమా 9:6; మత్త 23:35-39; I థెస్స 2:15,16; యెహె 20:38). ఆ తీర్పు యొక్క పరిణామములో భౌతిక మరియు ఆత్మీయ మరణం కూడ ఉంటుంది.

## 9. తొమ్మిదవ దర్శనం - కొలతూములో స్త్రీ (5:5-11)

ఈ దర్శనంలోని కొన్ని వివరాలను అర్థం చేసికోవడం కష్టం. ఇశ్రాయేలు యొక్క పాపాల పరిమాణమంతా దేవునికి తెలుసునని, దానినంతా ఆ దేశం నుండి తొలగించి ఆ పాపము వారిలోనికి ఎక్కడి నుండి వచ్చిందో, ఆ బబులోను దేశంలోనికే, పంపిస్తాడని కొంతమంది అభిప్రాయం.

అప్పుడు ఆయన దేశంలో ఇక చెడుగుకు తావుండదు. అది పవిత్ర దేశంగా ఉంటుంది. అన్ని చెడుగులకు బబులోను నివాస స్థానంగా ఉంటుంది (ప్రక 17:1-5; 18:2-8,23,24). అయితే ఇశ్రాయేలు దేశం నుండి దానిని బబులోనుకు ఎలా పంపిస్తాడో స్పష్టంగా చెప్పలేము. బబులోను అంటే ప్రకటన 17-18 అధ్యాయాలలో కనిపించే మత, వ్యాపార వ్యవస్థ అనుకోవచ్చును. యుగాంతంలో బబులోను పునర్నిర్మించబడుతుందని కొందరు పండితులు చెప్తారు. కాని అది నమ్మదగిన విషయంగా అనిపించదు. (యెష 13:17-22; యిర్మీ 50:39,40; 51:29, 37-43). కొలతూములోని స్త్రీ పాపమును, దోషమును సూచిస్తున్నది. సాధారణంగా బైబిలులో పాపము స్త్రీతో పోల్చి చెప్పబడింది (మత్త. 13:33; ప్రక 2:20; 17:1-7). కొలతూముపై నున్న సీసపు బిళ్ళ, దుష్టత్వాన్ని అడ్డగించే దేవుని శక్తిని సూచిస్తుంది.

ఇక్కడ వ్రాయబడిన షీనారు దేశం బబులోనులో ఉన్నది (ఆది 11:2; దాని 1:2) బబులోను దేశము యొక్క పాపము చారిత్రాత్మకంగా ఆది 11:1-9లో, దేవుని పై తిరుగుబాటుతో (బాబెలు గోపురం వద్ద) ప్రారంభమై ప్రవచనాత్మకంగా ప్రక 18:2 వరకు కొనసాగించబడుతుంది. తరువాత అది సమూల నాశనం చేయబడుతుంది.

## 10. పదవ దర్శనం - నాలుగు రథాలు (6:1-8) :

ఈ ఆఖరు దర్శనం, భూమి అంతటిలో దేవుని ఉద్దేశం యొక్క నెరవేర్పును. అనగా దేవుని ప్రజలను బాధించిన దేశాలపై తీర్పును గూర్చి తెలియజేస్తుంది (1:14; 15,21; 12:2-4; 14:2-3). యెషయా, యిర్మీయా, యెహెజ్కేలు తదితర ప్రవక్తలు కూడ దీని గూర్చి వ్రాసారు.

ఈ దర్శనంలోని రెండు (ఇత్తడి) పర్వతాలు, యూదయులోని ప్రాముఖ్య పర్వతాలైయుండ వచ్చును. ఇత్తడి, దేవుని ధృఢసంకల్పం గూర్చి, అనగా యెరూషలేము విషయం ఆయన ఉద్దేశాలు ఎన్నడూ సమసిపోవన్న సత్యాన్ని సూచిస్తూ ఉండవచ్చును లేక ఆయన తీర్పును సూచిస్తూ ఉండవచ్చు (నిర్గ 27:1,2; ప్రక 1:15).

ఇక రథాలు, అన్యదేశాల మీద పలు తీర్పులు జరిగించే దేవుని ప్రతినిధులు అని చెప్పుకోవచ్చును (ప్రక 7:1-3). గుఱ్ఱాలు పలు విధ తీర్పులకు సూచనగా ఉన్నాయి (ప్రక 6:1-6 పోల్చి చూడండి). వీటిలో ఉత్తర దేశములోనికి పోవునవి, దేవుని ఆత్మను

నెమ్మది పరుస్తాయి (6:8). ఇశ్రాయేలు దేశంపైకి దాడులు తరచుగా ఉత్తర దిక్కునుండే వచ్చాయి. చివరి కాలంలో అంతిమ మహాదాడి కూడ అటునుండే వస్తుంది (యెహె 38:1-9; 39:2). వారిపై దేవుని కోపం విడుదల కావచ్చును. బహుశా ఇది మహాశ్రమల కాలంలో రష్యా మీదికి రానున్న దైవిక తీర్పు కావచ్చు (యెహె 38, 39 అధ్యా).

జెకర్యా 9:9-15లో, యెహోషువకు కిరీటాన్ని ధరింపజేయుట, భవిష్యత్తులో చిగురుగా రాబోతున్న మెస్సీయాను సూచిస్తున్నది. బబులోను చెరకు వెళ్ళిన యూదులు మూడు విడతలుగా యెరూషలేముకు తిరిగి వస్తారు (6:10). వారు అక్కడి నుండి బంగారమును, వెండిని కానుకలుగా తీసికొని వస్తారు. ఈ కానుకలలో నుండి బంగారు కిరీటాన్ని చేసి యెహోషువకు ధరింపజేయాలని జెకర్యా ఆజ్ఞాపించబడ్డాడు. రాబోయే మెస్సీయా, రాజుగా, యాజకునిగా బాధ్యత వహించడమే కాకుండ, దేవుని మందిరాన్ని కూడ నిర్మిస్తాడు. మూడు విడతలుగా తిరిగి వచ్చిన యూదుల గుంపులు చెదరిపోయిన స్థలాల నుండి ఒక దినాన పాలస్తీనకు తిరిగి రానున్న అనేకమంది ఇశ్రాయేలీయులకు సూచనగా ఉన్నారు.

## II. ఇశ్రాయేలు ప్రజల వ్యర్థతలు (7-8 అధ్యా) :

బబులోను నుండి తిరగి వచ్చిన వారిలో కొందరు యూదులు, బేతేలు నుండి యెరూషలేముకు వచ్చి, ప్రతి సంవత్సరములాగే 5వ నెల ఉపవాసముండి దుఃఖించాలా? అని యాజకుణ్ణి ప్రశ్నించారు (7:1-3). యెరూషలేము నాశనం చేయబడిన సందర్భానికి జ్ఞాపకార్థంగా వారు ఈ దినమును ఆచరిస్తున్నారు గాని దేవుని వాక్యం అలా చెప్పడం లేదు. ప్రారంభంలో నిజంగానే ఆ దినము ఎంతో యదార్థంగా ఆచరించబడింది. అయితే అది రాను రాను ఆచారంగా మారిపోయింది. చెదరిపోయిన యూదులు ఈ ఆచారం విషయం ఆసక్తి కలిగి ఉన్నారు, గాని అందుకు యాజకుల ఆమోదాన్ని కోరుతున్నారు. ఇది ప్రస్తుత ఆధునిక అనుకరణాత్మక క్రైస్తవ్యం లాగే ఉన్నది. ఇవన్నీ బైబిల్‌లో లేని నిష్ప్రయోజక పద్ధతులని, దేవుడు యాజకుల ద్వారానే వారికి జవాబు చెప్తూ హెచ్చరించాడు.

వారి హృదయాలు యదార్థంగా లేనప్పుడు వారు చేసినవి లెక్కలోనికి రావని దేవునితోను, పొరుగు వారితోను వ్యవహరించే విధానంలో యదార్థంగా ఉండాలని హెచ్చరించాడు (8:16-19). అంత మాత్రమే కాదు ఆయన కృపను బట్టి, వారి ఉపవాసదినాలు ఒకనాడు పండుగదినాలుగా, వారి దుఃఖం ఆనంద గానంగా మార్చబడతాయని దేవుడు వాగ్దానం చేసాడు (8:3,4,5,,22,23).

## III. రాజు యొక్క సందర్శనము (9-14 అధ్యా) :

అ. **రాజు మొదటి రాకడ :** యేసు క్రీస్తు మానవునిగా వచ్చినపుడు తన తండ్రి ఆజ్ఞను బట్టి, ఆయన మందను మేపడానికి వచ్చాడు (11:7). ఇశ్రాయేలు కాపరులు ఆయనను తిరస్కరించారు (11:8). కనుక కొంత కాలం కొరకు వారిని ప్రక్కకు పెట్టాడు అన్నదానికి

సూచనగా ఒక కఱ్ఱ విరువబడింది (11:10; మత్త 21:19, 42-46; 23:37-39). యెరూషలేములో జయోత్సాహముతో ప్రవేశించుటతో ఆయన పరిచర్య ముగించబడింది (9:9; మత్త 21:1-11). తరువాత ఆయన 30 వెండి నాణాలకు అమ్మబడ్డాడు (11:12; మత్త 26:15). ఇది ఎద్దుకు బదులుగా చెల్లించే వెల మరియు దాసుని విడిపించే వెల (నిర్గ 21:32). ఆ క్రయధనము కుమ్మరివాని ఎదుట పారవేయబడింది (11:13; మత్త 27:7). ఇది విరక్తితో చేసినట్లున్నది తరువాత ఆయన రెండవ కఱ్ఱను విరిచాడు (1:14). ఇది క్రీ.శ. 70 సం॥లో జరిగిన యెరూషలేము యొక్క నాశనాన్ని సూచిస్తున్నది. ఈ విషాదము ఇశ్రాయేలు వారికి, యూదావారికి మధ్యగల ఐక్యతను అంతమొందించింది. చివరిగా జెకర్యా 12:10లో ఆయన సిలువ మరణాన్ని గూర్చి చెప్పబడింది.

**ఆ. రాజు రెండవ రాకడ :**

1. ఇశ్రాయేలీయులు మంచి కాపరియైన యేసును, ఆయన మొదటి రాకడలో త్రోసిపుచ్చినందుకు, ఆయన రెండవ రాకడకు ముందు కొంత కాలం వరకు వారు అబద్ధ కాపరి అయిన క్రీస్తు విరోధికి అప్పగింపబడతారు (11:15-17). ఈ శుద్ధీకరణలో మూడింట రెండు వంతుల ప్రజలు చంపబడతారు. ఒక భాగము, అగ్నిలో నుండి వెండిని శుద్ధిపరచినట్లు శుద్ధీకరించబడతారు (12:8,9).
2. ఇశ్రాయేలు విలపించుట (12:10-14) : యేసు ప్రభువు తిరిగి వచ్చినప్పుడు, ఇశ్రాయేలీయులు చివరిగా తమ రాజును గుర్తిస్తూ ఆయనను చంపి జాతీయ నేరాన్ని చేసినందుకు విలపిస్తారు (12:10).
3. హర్‌మెగిద్దోను యుద్ధం (12:1-9; 14:1-3, 12-15)
4. యుద్ధపు విల్లు (10:4) : ఈ యుద్ధపు విల్లు దేవుని కుమారుడైన యేసుక్రీస్తే. పగతీర్చుకొనుట అనే దేవుని బాణం ఈ విల్లు ద్వారా భూమిపైకి వేయబడుతుంది.

అ. ఆయన ఇశ్రాయేలును హింసించిన దేశాలను శిక్షిస్తాడు (9:1-4,12-16).

ఆ. యూదా ఇంటి వారిని బలపరచి, వారిని ఈల వేసి సమకూరుస్తాడు (10:8). తన ప్రజలను శిక్షించడానికి శత్రువులను సమకూర్చినట్లు (యెష 7:18,19) తన ప్రజలను తిరిగి వారి దేశానికి సమకూరుస్తాడు.

ఇ. దేశాలన్నిటికి తన శాంతి సమాధాన వార్తను అందజేస్తాడు (9:10). వీటన్నిటిని ఆయన అందరికీ కనిపించేలా చేస్తాడు (14:4,8) చివరిగా దేవుని ప్రజలు పొందబోయే ఆధిక్యతలను మరియు ఆశీర్వాదాలను గూర్చి జెకర్యా వివరించాడు (9:16,17; 13:1,9; 14:,9,10,11,16,20,21). భవిష్యత్తులో పొందబోయే ఈ దీవెనలే విశ్వాసులందరు కూడ అదే నిరీక్షణతో ఈ లోకంలో తమ విశ్వాసాన్ని కాపాడుకొంటు, నమ్మకంగా జీవించే కృప ప్రభువు దయచేయును గాక! (తీతు 2:12, 13).

★ ★ ★ ★ ★

# గొప్ప ప్రశ్నలు

## మలాకీ గ్రంథం సంగ్రహ సమీక్ష

**A. ఉపోద్ఘాతం :**

క్రీస్తుకు పూర్వం 1000 సంవత్సరాల ముందు చరిత్రను చూస్తే, దేవుడు తన ప్రవక్తల ద్వారా మెస్సీయా రాకడను గూర్చి మానవులకు వెల్లడించుటలో రాను రాను ఉన్నత స్థాయిలోనికి వెళ్ళాడు. పాతనిబంధనలో మెస్సీయా రాకను గూర్చి ప్రవచించిన చివరి స్వరం మలాకీ ప్రవక్తదే. మలాకీ పాత నిబంధనకు తెరవేసాడు. అనంతరం, 400 సంవత్సరాల విరామం తరువాత బాప్తిస్మమిచ్చు యోహాను ఆ తెరను తొలగించి క్రొత్త నిబంధనలోనికి ప్రవేశింపజేసాడు.

1. **గ్రంథకర్త :** గ్రంథం ప్రారంభంలోని పేరును బట్టి దీనిని మలాకీ వ్రాసాడని చెప్పవచ్చును. అయితే అతని పేరు తప్ప వివరాలేవి లేవు. వాస్తవంగా "మలాకీ" అంటే వార్తాహరుడు లేక దూత అని అర్థం. వార్తాహరుడు దేవుని దూత అయినా, మనిషి అయినా అతడు తెచ్చే వార్త ముఖ్యంగాని అతని వివరాలు కాదు గనుక, దేవుని ఆత్మ అతని గూర్చిన వివరాలను గ్రంథంలో అనుమతించలేదేమో. అయితే కొంత మంది దీనిని ఆధారం చేసికొని, ఈ దూత ఒక అనామకుడు కావచ్చును అని విమర్శించారు.

2. **గ్రంథ రచన కాలం :** మలాకీ గ్రంథం రచన కాలమును గూర్చి పలు భిన్నాభిప్రాయాలున్నాయి. జెరుబ్బాబెలు మరియు యెహోషువ కాలంలో హగ్గయి, జెకర్యా ప్రవక్తలు, మరియు నెహెమ్యా కాలంలో మలాకీ ప్రవచించాడు. కనుక నెహెమ్యా యూదాకు గవర్నరుగా ఉన్న కాలంలోగాని, తరువాత కాలంలోగాని అనగా బహుశా, క్రీ.పూ. 397వ సం॥లో ఈ గ్రంథం వ్రాయబడి ఉండవచ్చును.

3. **మలాకీ సందేశం :** మలాకీ పాత నిబంధన అంతటిని సంక్షిప్తంగా వివరించడమే గాక, ఇతర గ్రంథాలలోని ప్రాముఖ్య సత్యాలన్నీ వివరించాడు. ఇశ్రాయేలు ఏర్పరచబడుట (1:2; 2:4-6,10), దేశాలపైకి రానున్న మహాశ్రమలు (4:1), అంతములో ఇశ్రాయేలు శుద్ధీకరణ (3:2-4,12,16-18; 4:2-6) అనే అంశాలు ఇందులో ఉన్నాయి. అంత మాత్రమే కాదు నెహెమ్యా ఏ సమస్యలను గూర్చి తగిన చర్య తీసుకున్నాడో, వాటిని గూర్చే మలాకీ కూడ శ్రద్ధవహిస్తూ, ఇశ్రాయేలును ఖండించాడు. (యాజకత్వంలోని అపవిత్రత, అన్య వివాహాలు, భార్యలను పరిత్యజించుట మరియు దశమభాగం మొదలైన సమస్యలు).

4. గ్రంథ విశిష్ఠత :

అ. మలాకీ వార్తాహరుడు గనుక దేవుని సేవకులను ఆయన దూతలుగా వర్ణించాడు. లేవీయులు (2:7); బాప్తిస్మమిచ్చు యోహాను (3:1); యేసు క్రీస్తు (3:1). దేవుని వాక్యాన్ని అందించే ప్రతి ఒక్కరూ ఆయన దూతలే (ప్రక 2:1).

ఆ. పాత నిబంధనలో మెస్సీయాను గూర్చిన మొదటి ప్రవచనాన్ని మోషే వ్రాసాడు (ఆది 3:5). చివరి ప్రవచనాన్ని మలాకీ వ్రాసాడు (4:2).

ఇ. దానియేలు గ్రంథంలో చెప్పబడిన 70 వారాలను గూర్చిన ప్రవచనంలో (దాని 9:24-27) మొదటి భాగంలోని 49 సంవత్సరాలు మలాకీ కాలం పూర్తి అయ్యేనాటికి (క్రీ.పూ. 396) పాక్షికంగా నెరవేరింది. (యెరూషలేము మరల కట్టింపవచ్చునన్న ఆజ్ఞ బయలు దేరిన కాలము).

## B. గ్రంథ విభజన :

1. ఇశ్రాయేలు పట్ల దేవుని ప్రేమ (1:1-5)
2. యాజకులు వారి అపవిత్రతను బట్టి గద్దించబడుట (1:6-2:7)
3. ప్రజలు సామాజిక పాపాల విషయం గద్దించబడుట (2:10-17)
4. ఇద్దరు దూతలను గూర్చి ముందుగా చెప్పబడుట (3:1-6)
5. ప్రజలు మతపర పాపాలను గూర్చి గద్దించబడుట (3:7-18)
6. ప్రభువు దినమును గూర్చి మరియు అందులో పరిచర్య చేసే నీతి సూర్యుని గూర్చిన ప్రవచనం (4 అధ్యా).

## C. అంశాలవారిగా సంక్షిప్త వివరణ :

### 1. దేవుని ప్రేమ వివరించబడుట (1:1-5)

మలాకీ గ్రంథంలో 7 ప్రశ్నలున్నాయి. అవి శరీర సంబంధులైన ఇశ్రాయేలీయులను దేవుడు అడగాలనుకొన్న ప్రశ్నలు. అంతకు ముందే దేవుడు వారికి స్పష్టంగా చెప్పిన విషయాలను గూర్చే ఈ ప్రశ్నలు వేయబడ్డాయి. అందులో మొదటి ప్రశ్న " ఏ విషయమందు నీవు మా యెడల ప్రేమ చూపితివందురు?" (1:2). ఇశ్రాయేలీయులు దేవునిపై ఈ నేరం మోపుతూ, దానిని రుజువుపరచుకొనమని అడిగినట్లున్నది. వీరు ప్రశ్నించడానికి ఒక బలీయమైన కారణమున్నది. యెరూషలేమును ఫిలిష్తీయులు మరియు అరబీయులు నాశనం చేసినప్పుడు, ఎదోమీయులు ఇశ్రాయేలీయుల పట్ల కఠినంగా ప్రవర్తించిన తీరును వారు జ్ఞాపకం చేసికొని (II ది.వృ. 21:16,17; ఓబద్యా 1:11, 14; కీర్త 137:7) ఒక వేళ దేవుడు మమ్మల్ని ప్రేమిస్తే వీటిని అనుమతిస్తాడా? అన్న కారణంతో ఈ ప్రశ్న వేసారేమో.

కనుక వారికి దేవుడు రెండు సత్యాలను జ్ఞాపకం చేస్తూ వారికి జవాబు నిచ్చాడు.

1. ఏశావు కంటె ఇశ్రాయేలునే దేవుడు ఎక్కువగా ప్రేమించాడు. వారికే ప్రాధాన్యత నిచ్చాడు (1:2). దేవుడు వ్యక్తిగతంగా ఏశావును ద్వేషించినట్లు బైబిలులో ఎక్కడా లేదు. సాధారణంగా ఈ మాట, ప్రాధాన్యతనిచ్చుటను, గూర్చి ఉపయోగించబడింది (లూకా 14:26). మలాకీ 1:2లో దేవుడు రెండు జాతులను గూర్చి అనగా ఇశ్రాయేలీయులు మరియు ఏదోమీయులను ఉద్దేశించి చెప్తున్నాడు. దేవుడు ఎదోమీయులను ద్వేషించలేదు గాని వారి పాపనైజాన్ని ద్వేషించాడు.

2. తనకంటె పాపావలెనున్న ఇశ్రాయేలు పట్ల, ఎదోము ప్రవర్తనను బట్టి దేవుడు ఎదోమును వర్ధిల్లనివ్వడు.

## II. దేవుని ప్రేమ అవమాన పరచబడింది (1:6-2:9) :

**అ. ప్రవక్తల ద్వారా అవమానపరచబడింది :** ఈ భాగంలో రెండు ప్రశ్నలున్నాయి. "ఏమి చేసి నీ నామమును నిర్లక్ష్యపెట్టితిమి?" (1:6) "ఏమిచేసి నిన్ను అపవిత్రపరచితిమి?" (1:7).

1. ఇశ్రాయేలీయులు పనికి మాలిన అర్పణల వలన దేవుణ్ణి మోసం చేసారు. కుంటి వాటిని, జబ్బుగా ఉన్న వాటిని ఆయనకు అర్పించారు. వారు దేవుణ్ణి సరైన రీతిగా ఘనపరచలేదు. కనీసం కుమారుడు తండ్రిని ఘనపరచినట్లు (1:6), దాసుడు యజమానిని ఘనపరచినట్లు (1:6), రాజును ఒక పౌరుడు ఘనపరచినట్లు కూడా (1:14) ఆయనను ఘనపరచలేదు.

2. తమ చెడ్డ ప్రవర్తన ద్వారా ప్రజలను కూడ మోసగించారు (2:7-9).

**ఆ. ప్రజల ద్వారా అవమాన పరచబడింది :**

1. వారి అసమానతలను బట్టి **(in equalities)** (2:10)
2. అన్యులను వివాహం చేసికొనుటను బట్టి **(inter marriages)** (2:11)
3. వారి అనైతికతను బట్టి **(immorality)** (2:14)
4. యదార్థత లేనందు వలన **(insencerity)** (2:17)
5. వారు దేవునికి అచ్చియుండుటను బట్టి **(indebtedness)** (3:8-10)
6. వారి దోషమును బట్టి **(incrimination)** (3:13-15)

## III. దేవుని ప్రేమ వెల్లడించబడింది :

అ. ఆయన తన భక్తులను జ్ఞాపకం చేసికొనుటను బట్టి దేవుని ప్రేమ వెల్లడించబడింది (3:16,17). ఆయన నామము అంటే (3:16), బైబిలులో ఆయనకు గల బిరుదులన్నీ అందులో ఇమిడి ఉన్నాయి.

ఆ. ఆయన తన స్వంత కుమారుని పంపించుట ద్వారా దేవుని ప్రేమ వెల్లడించబడింది.

1. యేసు క్రీస్తు మొదటి రాకడను గూర్చి బాప్తిస్మమిచ్చు యోహాను ద్వారా ప్రకటించబడింది (3:1).

2. ఆయన రెండవ రాకడను గూర్చి ప్రవక్తయైన ఏలియా ద్వారా ప్రకటించబడనున్నది (4:5,6). ప్రకటన 11:3–14 కూడ చదవండి.

3. యేసు క్రీస్తు రెండవ రాకడ యొక్క ఉద్దేశం ద్వారా దేవుని ప్రేమ వెల్లడించబడింది.

ఎ) ఇశ్రాయేలును శుద్ధీకరించుట (3:2–4)

| | |
|---|---|
| యూదులు క్రీస్తును అంగీకరిస్తారు | – 3:16 |
| వారు క్రీస్తు ద్వారా సమకూర్చబడతారు | – 3:17 |
| క్రీస్తు ద్వారా శుద్ధీకరించబడతారు | – 3:2,3 |
| క్రీస్తు ద్వారా స్వస్థతనొందుతారు | – 4:2 |

బి) అన్యులను శిక్షించుట (4:1,3)

అవినీతిమయమైన, శాపకరమైన ఈ ప్రపంచాన్ని అత్యంత మహిమాన్వితమైన క్షణం కోసం, అనగా రాజుల రాజు మరియు ప్రభువుల ప్రభువు యొక్క ప్రత్యక్షత కోసం సిద్ధపరచే ఆధిక్యతను ఏలియా పొందాడు.

ఆయన రాకడ కొరకు సిద్ధపడిన వారందరూ ఆ మహిమాన్విత సమయాన్ని చూసే ఆధిక్యతను పొందుతారు. అట్టి కృప ప్రభువు మనకు దయచేయును గాక!

★ ★ ★ ★ ★

**TTB-Telugu-Study Outlines-Book of Zephaniah, Haggai, Zechariah, Malachi**
Printed by : Premadhara, Trans World Radio - India
12-1-334/17/3, Lalapet, Secunderabad - 500 017
Ph : 040-27003011

**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**